# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 2-10-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:53 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం-నేటికి అందం**

పురుషుల,తరుణుల జట్టులు
వర మిశ్రమ జట్టు కూడ బంగారములన్
కరముల యందున దాల్చగ
భరతావని ఆర్చరీకి ప్రఖ్యాతి గొనెన్ !!

(ఆర్చరీలో పురుషుల జట్టు, మహిళల జట్టు, మిక్సుడ్ టీమ్ మూడు కూడా బంగారు పతకాలు గెలిచి భారత దేశం విలువిద్యకు కాణాచి అని నిరూపించాయి)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

ప్రజాస్వామ్య పరిరక్షణ
పోరుకై మళ్లీ పిలుపు
సమైక్యంగా విపక్షాలు
సాగితేనే మేలుకొలుపు.
ఇండియా కూటమి
ఇంటిపైనా పెంకులు
బలపడని విశ్వాసం
బంధాలతో లింకులు.



-వేల్పుల నారాయణ
9440433475

## లక్షల మంది యువత ఆశయాల వేడుక యూపీఎస్సీ.. శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని మోదీ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 1: యువతను కేవలం ఉద్యోగం కోసం కాకుండా ప్రజాసేవ స్ఫూర్తితో పబ్లిక్ సర్వీసెస్ లోకి తీసుకురావాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వందేళ్ల ప్రస్థానం లక్షల మంది యువత ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని కొనియాడారు. లక్షల మంది యువత ఆశయాల వేడుక యూపీఎస్సీ అని కీర్తించారు. గురువారం ఢిల్లీ లోని భారత్ మండపంలో జరిగిన యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా యూపీఎస్సీ శతాబ్ది స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌తోపాటు '100 ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. బుధవారం జరిగిన ఒక విమాన ప్రమాద ఘటనలో అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. భారత పైలట్ కెప్టెన్ స్మిత్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి, నిబద్ధత ప్రశంసనీయం అన్నారు. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లుగా 9/11 తరహా ఘోర విషాదాన్ని ఒక భారతీయుడు అడ్డుకున్నాడని మోదీ అన్నారు.

స్మిత్ ఘనత మనందరికీ గర్వకారణమని, తాను ఆయన కుటుంబసభ్యులతో మాట్లాడానని ప్రధాని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న స్మిత్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని దేశ ప్రజలందరూ ప్రార్థించాలని పిలుపునిచ్చారు. యూపీఎస్సీ వందేళ్ల ప్రస్థానంపై మోదీ మాట్లాడుతూ.. ఇది కేవలం ఒక సంస్థ వందేళ్లు పూర్తి చేసుకోవడం కాదని, ప్రతి భారతీయుడు ఈ సంస్థపై ఉంచిన అచంచల విశ్వాసానికి ఇది నిలువుటద్దమని అన్నారు. ఈ సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రతి ఒక్కరికీ ప్రధాని అభినందనలు తెలిపారు.

అనంతరం సివిల్ సర్వీసుల చరిత్రను, మహనీయుల సేవలను మోదీ గుర్తుచేసుకున్నారు. 1920లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారని అన్నారు. నాడు బ్రిటిష్ పాలన ఉన్నప్పటికీ బోస్ సంస్కృతంలో పేపర్ రాశారని ఇక్కడి గ్యాలరీలో చూసినట్లు తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సర్దార్ వల్లభాయ్ పటేల్ యూపీఎస్సీని దేశానికి ఒక ప్రధాన స్తంభంగా తీర్చిదిద్దారని చెప్పారు. 1926 అక్టోబర్ 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా ప్రారంభమైన ఈ సంస్థ.. శతాబ్దకాలంలో ఎన్నో మార్పులకు లోనై స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థగా రూపుదిద్దుకుందని ప్రధాని గుర్తుచేశారు.

కాగా గత ఏడాది అక్టోబర్ 1న ప్రారంభమైన శతాబ్ది ఉత్సవాలు ఇవాల్టి కార్యక్రమంతో ముగిశాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీల్లో రెండు రోజులపాటు జరిగిన ఈ వేడుకలకు వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లు, సభ్యులు, కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు, విద్యావేత్తలు, యూపీఎస్సీ అధికారులు హాజరయ్యారు.

## 'వన్ నెట్‌వర్క్, స్మార్ట్ ట్రాఫిక్' ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిన కేంద్ర కేబినెట్: రియల్-టైమ్ ట్రాఫిక్ నిర్వహణ వైపు అడుగులు వేస్తున్న ఢిల్లీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 1:ఢిల్లీ పోలీసు వ్యవస్థలో ఇంటెలిజెంట్ ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థ (ఐటీఎంఎస్) అమలు చేసే ప్రాజెక్టుకు పన్నులతో కలుపుకుని దాదాపు రూ. 1,789.52 కోట్ల వెచ్చించేందుకు ప్రధా నమంత్రి అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ(సీసీఈఏ) ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టును గుర్తించిన 42 ట్రాఫిక్ కారిడార్లలో చేపట్టనున్నారు. దీనిని 24 నెలల వ్యవధిలో మూడు దశల్లో అమలు చేస్తారు. ఆ తర్వాత ఐదు సంవత్సరాల పాటు నిర్వహణ, కార్యకలాపాలు కొనసాగుతాయి.

జాతీయ రాజధానిలో ట్రాఫిక్ నిర్వహణ, రవాణా మౌలిక సదుపాయాలు, పట్టణ చలనశీలతను మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ ప్రభుత్వం చేస్తున్న విస్తృత ప్రయత్నాలలో భాగంగా ఇంటెలిజెంట్ ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థ (ఐటీఎంఎస్) ద్వారా ఇప్పుడు ఒక ప్రధాన సాంకేతిక ఆధారిత అడుగువేస్తున్నారు. రియల్-టైమ్ ట్రాఫిక్ డేటా, అడాప్టివ్ ట్రాఫిక్ సిగ్నల్స్, ఆటోమేటెడ్ నిబంధనల అమలు, సమగ్ర కమాండ్- అండ్-కంట్రోల్ వ్యవస్థల ద్వారా ఢిల్లీలో ఇప్పటికే ఉన్న రోడ్డు నెట్‌వర్క్‌ను మరింత స్మార్ట్‌గా నిర్వహించడానికి ఈ ప్రాజెక్ట్ వీలు కల్పిస్తుంది.ఢిల్లీలో ప్రస్తుతం సుమారు 71 లక్షల నమోదిత వాహనాలు(ప్రస్తుతం నడుస్తున్నవి) ఉన్నాయి. రోడ్డు మౌలిక సదుపాయాల విస్తరణ కంటే వాహనాల వృద్ధి గణనీయంగా పెరిగింది. అయితే ట్రాఫిక్ నియంత్రణ ఇప్పటికీ ఎక్కువగా స్థిరమైన సిగ్నల్ సమయాలు, మాన్యువల్ జోక్యంపైనే ఆధారపడి ఉంది. రహదారిపై వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ట్రాఫిక్ నిర్వహణ గతిశీలకంగా స్పందించేలా చేయడం ద్వారా అందుబాటులో ఉన్న రోడ్డు సామర్థ్యాన్ని మెరుగ్గా ఉపయోగించుకోవడానికి ఐటీఎంఎస్ ప్రయత్నిస్తుంది.






## బీఆర్ఎస్‌తో పొత్తు ఉంటుందని ఎవరు అన్నారు?: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 1: తెలంగాణ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో ఎట్టిపరిస్థితుల్లోనూ తమ పార్టీ పొత్తు పెట్టుకోదని బీజేపీ నేత, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

తెలంగాణ ఎన్నికల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఎన్నికలు ఏవేనా సరే పొత్తుల్లేకుండా పోటీ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఓ విలేకరి అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిస్తూ.. 'బీఆర్ఎస్‌తో పొత్తు ఉంటుందని ఎవరు అన్నారు? పొత్తును ఎవరూ కోరుకోవడం లేదు. మొదట కేటీఆర్ ఆయన చెల్లెలు కవితను కలవమనండి. తరువాత వేరే పొత్తులు కోరుకోవచ్చు' అని కిషన్ రెడ్డి అన్నారు.

## మోడీ పాలనలో తల్లీబిడ్డల ఆరోగ్యానికి కొండంత రక్షణ కవచం

**'సాక్షం'తో అంగన్‌వాడీల రూపురేఖలు మార్చిన ఘనత కేంద్రానిదే**
**'పోషణ్ అభియాన్', 'పీఎం మాతృవందన'లతో పేద గర్భిణులకు అడుగడుగునా అండ**
**బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి**



కరీంనగర్, అక్టోబర్ 1:చిన్నారులను ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా కాపాడేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మిషన్ ఇంద్రధనుష్' భావితరాల పాలిట సంజీవని అని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి కొనియాడారు. రాగంపేట అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా నిర్వహించిన 'అంగన్‌వాడీ మిలన్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు."తల్లీబిడ్డ బాగుంటేనే.. భారతదేశం బాగుంటుంది!" అనే దృఢ సంకల్పంతో పనిచేస్తున్న ఏకైక నాయకుడు నరేంద్ర మోడీ అని, అందుకే గత దశాబ్ద కాలంగా మాతా-శిశు సంక్షేమానికి బడ్జెట్‌లో రికార్డు స్థాయి నిధులు కేటాయిస్తూ అండగా నిలిచారని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆయన మోడీ ప్రభుత్వ పథకాలను ప్రస్తావిస్తూ... × 'మిషన్ ఇంద్రధనుష్' తో మారుమూల పల్లెలు, గిరిజన తండాల్లోనూ డిఫ్తీరియా, పోలియో, ధనుర్వాతం, తట్టు సహా 12 ప్రాణాంతక వ్యాధులకు ఉచితంగా వ్యాక్సిన్లు వేస్తున్నారని తెలిపారు. ప్రతి చిన్నారికి, గర్భిణీకి సంపూర్ణ వ్యాక్సినేషన్ అందిస్తూ దేశంలో శిశు మరణాల రేటును (ఎంఆర్) అపూర్వంగా తగ్గించిన ఘనత మోడీ సర్కార్‌దేనన్నారు. × 'సాక్షం అంగన్‌వాడీ' తో అంగన్‌వాడీలను సమగ్ర వికాస వేదికలుగా తీర్చిదిద్ది తాగునీరు, విద్యుత్, ఆధునిక ప్రీ-స్కూల్ సామగ్రి అందించారని. స్మార్ట్‌ఫోన్ లో డేటా రోజు తీసుకుంటూ 'పోషణ్ ట్రాకర్' ద్వారా పిల్లల ఎదుగుదలను డిజిటల్‌గా పర్యవేక్షిస్తూ పారదర్శక పాలనకు తెరలేపారని కొనియాడారు.చిన్నారుల్లో రక్తహీనత, ఎదుగుదల లోపాలను తరిమికొట్టేందుకు గుడ్లు, పాలు క్రమం తప్పకుండా 'పోషణ్ అభియాన్' నిర్వహిస్తూ ఏటా 'పోషణ్ మాసం' ద్వారా ప్రజల్లో విశేష చైతన్యం తెస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్ల సేవలు అభినందనీయమన్నారు. పీఎం మాతృవందన ఓ సుమన్ స్కీములతో పేద గర్భిణులకు ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు నేరుగా బ్యాంకు ఖాతాల్లోకే నగదు జమ చేస్తున్నరని , 'సుమన్' పథకంతో పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో 100% ఉచిత, సురక్షిత ప్రసవాలు జరుగుతున్నాయని వివరించారు."గతంలో పథకాలు కాగితాలకే పరిమితం.. మోడీ పాలనలో నేరుగా ప్రజల ముంగిటికి తెచ్చిన ఘనత మోడి సర్కార్ ధని ఆయన పేర్కొన్నారు, అంగన్‌వాడీలకు వెన్నుదన్నుగా నిలిచిన మోడీ నాయకత్వాన్ని ప్రతి ఒక్కరూ బలపరచాలని కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మొగిలి మహేష్, ప్రధాన కార్యదర్శి ఎడ్ల సురేష్, నాయకులు రాపెల్లి శ్రీనివాస్, దళిత మోర్చా మండల అధ్యక్షుడు (వార్డ్ సభ్యుడు) రాజు, సోషల్ మీడియా కన్వీనర్ గుండె వెంకటేష్, సింగసాని నరేష్, దామెర మధుసూదన్ రెడ్డిలతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు నజిమ, సరోజన, ఎల్లమ్మ, కళావతి, ఆశా కార్యకర్తలు లలిత, శారద మరియు పెద్ద సంఖ్యలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## శబరిమల ప్రసాదంలో హలాల్ బెల్లం వినియోగం.. కేరళ హైకోర్టు కీలక వ్యాఖ్యలు....

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 1: శబరిమల ప్రసాదం తయారీలో హలాల్ సింబల్ కలిగిన బెల్లం వాడకంపై కేరళ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రసాదం తయారీకి అవసరమైన ముడి సరుకు కొనేముందు వాటి లేబుల్స్‌ను జాగ్రత్తగా పరిశీలించాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ మేరకు శబరిమల దేవస్థానాన్ని నిర్వహించే ట్రావెన్‌కోర్ దేవస్థాన బోర్డ్ (టీడీబీ)కి హైకోర్టు సూచించింది. ప్రసాదం తయారీలో హలాల్ వాడకంపై దాఖలైన ఒక పిటిషన్ విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.శబరిమల అయ్యప్ప ఆలయంలో అరవణ, అప్పం ప్రసాదాల తయారీకి అనేక రకాల ముడి పదార్థాలు వినియోగిస్తుంటారు. ఈ ముడి పదార్థాలలో హలాల్ సర్టిఫైడ్ బెల్లం కూడా ఉంది. దీంతో ఈ పదార్థం వినియోగాన్ని వ్యతిరేకిస్తూ కేరళ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. మహారాష్ట్రకు చెందిన ఒక సంస్థ ఈ బెల్లాన్ని తయారు చేస్తుందని, ఇదే సంస్థ పశ్చిమాసియాలోని పలు ముస్లిం దేశాలకు కూడా బెల్లం సరఫరా చేస్తుండటంతో హలాల్ సర్టిఫికేషన్ కలిగి ఉందని కోర్టు గుర్తించింది. అందుకే, ఇలాంటి ఉత్పత్తుల కొనుగోలు విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోర్టు సూచించింది.

ప్రసాదం తయారీలో వాడే పదార్థాలు ఎలాంటి సూచికలు, ప్రకటనలు కలిగి ఉండరాదని కోర్టు పేర్కొంది. వేరే మతపరమైన సూచనల వల్ల శబరిమలలో అనుసరించే మత విశ్వాసాలు, సంప్రదాయాలు దెబ్బతింటాయని కోర్టు అభిప్రాయపడింది. అయితే, ప్రసాదం తయారీలో వాడుతున్న బెల్లం సర్టిఫికేషన్ విషయంలోనే అప్రమత్తంగా ఉండాలని, అంతేకానీ, పదార్థం నాణ్యత విషయంలో ఎలాంటి ఇబ్బందీ లేదని కోర్టు వ్యాఖ్యానించింది. ఇది 2021లో దాఖలైన కేసు. జస్టిస్ రాజా విజయరాఘవన్ వి. జస్టిస్ కేవీ జయకుమార్ ఆధ్వర్యంలోని బెంచ్ దీనిపై తాజాగా విచారణ జరిపి కీలక సూచనలు చేసింది. శబరిమలలో తయారు చేసే ప్రసాదంలో హలాల్ సర్టిఫికేషన్ కలిగిన బెల్లం వాడుతున్నారని, దీన్నే భక్తులకు అందిస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు.

## నర్సింగ్ విద్యార్థిని హరిణి హత్య కేసును ఛేదించిన జూలూరుపాడు పోలీసులు



ఖమ్మం, అక్టోబర్ 1: ప్రేమను నిరాకరించిందన్న కోపంతో ఓ ఉన్మాది రెచ్చిపోయాడు. ఎనిమిదేళ్లుగా వెంటతిరిగిన యువతి తనను దూరం పెడుతోందని కక్ష పెంచుకున్నాడు. ఏకంగా బైక్ గేర్ వైరుతో గొంతు బిగించి కిరాతకంగా హతమార్చాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం వెంగన్నపాలెంలో సంచలనం సృష్టించిన బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని ఇంద్రవెల్లి హరిణి (18) హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను జూలూరుపాడు పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ వెల్లడించారు. వెంగన్నపాలెం గ్రామానికి చెందిన సతీష్, రాజేశ్వరి దంపతుల కుమార్తె హరిణి, నిందితుడు దేవరకొండ పవన్ కుమార్ గత కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పవన్ కుమార్ ఎలాంటి పని చేయకుండా మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతుండడంతో హరిణి ఇటీవల అతడిని దూరం పెట్టింది. ఈ క్రమంలో ఏడాది క్రితం ఇరు కుటుంబాల పెద్దల సమక్షంలో పంచాయతీ సైతం జరిగింది.పవన్ కుమార్ ప్రవర్తన సరిగా లేనందున తమ కూతురు హరిణిని ఇచ్చి పెళ్లి చేయలేమని ఆమె కుటుంబ సభ్యులు తేల్చిచెప్పారు. అయినా పవన్ తీరు మారలేదు. తరచూ ఆమె వెంటపడుతూ వేధింపులకు గురిచేయడం మొదలుపెట్టాడు. దీంతో విసిగిపోయిన హరిణి, అతడి ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేయడంతో పాటు తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను సైతం మార్చేసింది. తనను పూర్తిగా దూరం పెడుతోందన్న అక్కసుతో పవన్ కుమార్ దారుణానికి ఒడిగట్టాడు. సెప్టెంబర్ 22న మధ్యాహ్నం సమయంలో వెంగన్నపాలెంలోని హరిణి ఇంటికి వెళ్లాడు. అప్పటికే ఇంట్లో ఉన్న ఆమెతో వాగ్వాదానికి దిగాడు. తనను ఎందుకు కాదంటున్నావని నిలదీశాడు. ఆమె ఎంతకీ అంగీకరించకపోవడంతో ఆవేశానికి గురైన పవన్ తన వెంట తెచ్చుకున్న బైక్ గేర్ వైరుతో హరిణి మెడకు గట్టిగా బిగించి దారుణంగా హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని ఇంటి పక్కన ఉన్న మెట్ల పక్కన సందులో పడేసి అక్కడి నుండి పరారయ్యాడు.

కూతురు విగతజీవిగా పడి ఉండడాన్ని చూసిన తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు జూలూరుపాడు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అయితే పోస్టుమార్టం నివేదికలో యువతి మెడకు వైరు లాంటిది బిగించి చంపినట్లు వైద్యులు నిర్ధారించడంతో పోలీసులు దీనిని హత్య కేసుగా మార్చి దర్యాప్తు వేగవంతం చేశారు.




# వన్యప్రాణుల ఆవాసాలను కాపాడుకోలేమా !

## (02 - 08 అక్టోబర్ "జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు" సందర్భంగా)

పాతరాతి యుగం నుంచి నేటి వరకు కూడా ప్రపంచ మానవాళి ఆహారం, ఔషధాలు, గృహనిర్మాణం, ఇంధనం, వస్త్రాల కోసం వనాలపై లేదా అటవీ వృక్ష జంతుజాలాలపై ఆధారపడి ఉంటున్నాడు. ప్రకృతి సహజ అందాల విందులు ఆరబోస్తున్న అటవీ సంపద పర్యావరణ వ్యవస్థను కాపాడడం జరుగుతున్నప్పటికీ మానవ తప్పిదాలతో వన్యప్రాణుల సంఖ్య తగ్గడం, జీవ వైవిధ్యానికి విఘాతం కలగడం జరుగుతున్నది. అన్ని రకాల వృక్ష జంతు జాతులతో మనిషి కలిసి స్నేహంగా జీవితాలను గడపని యెడల రాబోయే తరాలు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వన్యప్రాణుల సమతుల్యత దెబ్బతినకుండా వాటిని రక్షించుకుంటూ, జీవవైవిధ్యానికి పట్టం కట్టవలసిన సమయం ఆసన్నమైనది. భూమిపై సహజంగా జీవితాలను గడుపుతున్న అనేక రకాల జీవరాసులను పరిరక్షించుకోనిఎడల పలు జాతులు అంతరించే ప్రమాదంతో పాటు మానవ ఉనికి కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని అందరం తెలుసుకోవాలి.

**భావితరాల మనుగడకు జీవవైవిధ్యం, పర్యావరణ సమతుల్యత:**

మన పిల్లలకు అపార సంపదలను సంపాదించి పెట్టినప్పటికీ తాగడానికి చుక్క శుద్ధ నీరు, పోల్చడానికి పరిశుద్ధ గాలి లేనపుడు మనిషి వద్ద ఎన్ని ఉన్నా నిరర్థకమే అవుతాయని తెలుసుకోవాలి. పర్యావరణ వ్యవస్థను కాపాడడం, జీవ వైవిధ్యాలను సంరక్షించడం, సహజ ప్రక్రియలను నియంత్రించడం, మానవ జాతికి కనీస అవసరాలు తీర్చడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరడానికి వన్యప్రాణులు అమూల్య సేవలను అందిస్తున్నాయి. మనిషి అడక ముందే కూడు, గూడ, గుడ్డను ఇస్తున్న వన్యప్రాణుల పరిరక్షణ అవసరాలను ప్రజల్లో ఏకరువు పెట్టడానికి, హెచ్చరికలు చేయడానికి ప్రతి ఏట 02 -08 అక్టోబర్ "జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు" లేదా నేషనల్ వైల్డ్‌లైఫ్ వీక్" నిర్వహించడం జరుగుతున్నది. అడవుల్లో దాదాపు 60,000 వృక్ష జాతులు, 80 శాతం ఉభయచర జాతులు, 75 శాతం పక్షి జాతులు ప్రపంచవ్యాప్త 1.6 మిలియన్ల ప్రజలకు నేరుగా నిత్యావసరాలను తీర్చుతున్నాయి.

**జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు-2026:**

నేటి జీవజాతుల్లో దాదాపు ఒక్క మిలియన్ వరకు అంతరించే అంచున ఉన్నాయని భయంకర వాస్తవమే నిజమైతే మానవ శాంతియుత జీవనం బుగ్గిపాలు కావడం తప్పనిసరి. భూమిని, భూగ్రహంపై సహజంగా జీవిస్తున్న జీవరాశులను కాపాడకపోవడం మన కనీస కర్తవ్యం అని తెలుపులతో పాటు జీవవైవిధ్య పరిరక్షణకు అవసర నిధులు కూడా సహకరించడం ప్రధాన అంశమని ఐరాస పేర్కొంటున్నది. ప్రపంచ సగం జిడిపీ ప్రకృతి సంపద మీదనే ఆధారపడి ఉంటున్నది.

జీవవైవిధ్య పరిరక్షణకు లేవదా పునర్నిర్మాణానికి ప్రతి ఏట 143 బిలియన్ల డాలర్ల నిధులను ప్రపంచ దేశాలు అందిస్తున్నాయని, ఈ సత్కార్య నిర్వహణకు 824 బిలియన్ డాలర్లు అవసరం అవుతాయని, కనీసం ఏడాదికి 500 బిలియన్ డాలర్లు అయినా ప్రపంచ దేశాలు వెచ్చించాలని ఐరాస ప్రధాన కార్యదర్శి పేర్కొనడం విశేషం. భారతీయ "డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యూజియమ్స్ అండ్ జూస్" అనే సంస్థ జాతీయ స్థాయిలో వన్యప్రాణుల పరిరక్షణ కార్యాలు పటిష్ట పథకాలతో నడవాలి. భారత ప్రజలు, భూగోళం పరిరక్షణకు పెట్టుబడులు పెట్టడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. దేశ జనాభా ఆయురారోగ్యాలకు జీవవైవిధ్యంతో పాటు పర్యావరణ వ్యవస్థల సమతుల్యత అవసరం అవుతాయని, వీటి సాధనకు అవసరమైన ఆర్థిక నిధులు అందించాలని కోరడం జరుగుతున్నది. 2026 జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు-2026 ఇతివృత్తంగా "ఆవాసాలను అనుసంధానించడం ద్వారా వన్యప్రాణులను సంరక్షించడం" అనబడే అంశాన్ని తీసుకున్నారు.

జాతీయ వన్యప్రాణి వారోత్సవాల్లో చేయదగిన కార్యక్రమాలు:

జాతీయ వన్యప్రాణి వారోత్సవాల వేదికగా ప్రజలకు అవగాహన కల్పించడం, వన్యప్రాణులను కాపాడే సంస్థలు లేదా వ్యక్తులను గుర్తించడం, ఆర్థిక నిధుల సేకరణ, ప్రభుత్వాల చొరవ, ప్రజల సహకారం, ఎన్జీవోల చొరవ లాంటి వి నిర్వహిస్తేనే వన్యప్రాణుల పరిరక్షణ ఆవశ్యతకతను వివరించే కార్యశాలలు, సెమినార్లు, ఆన్‌లైన్ లేదా ఆఫ్-లైన్ అవగాహనలు, నిధుల సేకరణ కార్యక్రమాలు, ప్రపంచ దేశాల సమన్వయ సహకారాలు, విజ్ఞాన వితరణలు లాంటివి నిర్వహించడం మంచిది. పర్యావరణ సమతుల్యతకు గొడుగు పట్టడం, జీవవైవిధ్యానికి ఊపిరులూదడం, సహజ అందాలను ఆస్వాదిస్తూ కాపాడుకోవడం లాంటివి నిరంతరం కొనసాగాలి.

జీవవైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత, ఔషధాల లభ్యత, శుద్ధ జలాలు/పీల్చే గాలులు, వాతావరణ సానుకూల మార్పులు సమకూరుతాయి. ఈ విషయాలను నేటి మనిషి పెడచెవిన పెట్టి విధ్వంసానికి పాలుపడితే రేపటి తరం మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని, మనం కూర్చున్నా కొమ్మను మనమే నరుక్కోవద్దని గుణపాఠం నేర్చుకోవడంతో పాటు జీవవైవిధ్య దీపం ఉండగానే భూగృహాన్ని లేదా ఇల్లును చక్కదిద్దుకుందాం.



-మధుపాళీ
9949700037

# బీర్నందిలో పెద్ద పండుగ



ఆదిలాబాద్, అక్టోబర్ 1:నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని బీర్నంది గ్రామంలో గురువారం పెద్ద పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఏటా వానాకాలం పంటల సాగు, దిగుబడుల సందర్భంగా నిర్వహించే ఆనవాయితీలో భాగంగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఖరీఫ్ పంటలు సమృద్ధిగా పండడంతో పాటు గ్రామ ప్రజలు, పశుపక్ష్యాదులు ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో సర్పంచ్ జక్కుల నవీన్ యాదవ్, ఎంపీడీఓ రాధా రాథోడ్, ఉప సర్పంచ్ రాగుల రాకేష్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రూట్స్ ఏషియా సదస్సు సన్నాహక కార్యక్రమాన్ని ప్రారంభించిన పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

న్యూఢిల్లీ, అక్టోబర్ 1:ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ విమానయాన కార్యక్రమానికి ఆతిథ్యం ఇవ్వడానికి భారత్ చేస్తున్న సన్నాహాలలో ముఖ్యమైన ఘట్టంగా రూట్స్ ఆసియా 2027 సన్నాహక కార్యక్రమాన్ని (కర్టెన్ రైజర్) కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్ మోహన్ నాయుడు ఈ రోజు న్యూఢిల్లీలో ప్రారంభించారు. రూట్స్ ఏషియా 2027కు సంబంధించి నిర్వహించిన కర్టెన్ రైజర్ కార్యక్రమంలో 28 దేశాల రాయబార కార్యాలయాల ప్రతిని ధులతో పాటు, విమానయాన రంగానికి చెందిన ప్రముఖ ప్రతిని ధులు పాల్గొన్నారు. దీంతో రూట్స్ ఏషియా 2027 పై పెరుగుతున్న అంతర్జాతీయ భాగస్వామ్యం, సహకార అవకాశాలకు మార్గం సుగమం అయింది.

రూట్స్ ఏషియా 24వ సదస్సు 2027 మార్చి 16 - 18 తేదీల్లో న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతుంది. ఆసియా, ఇతర ప్రాంతాల నుంచి 115 పైగా ప్రముఖ విమానయాన సంస్థలు, 55 పైగా దేశాల ప్రతినిధులు, విమానాశ్రయాలు, పర్యాటక సంస్థలు, విమానయాన రంగ ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటారు.

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కర్టెన్ రైజర్ ఫలకాన్ని ఆవిష్కరిస్తూ, "భారత విమానయాన రంగం పురోగతి: సమ్మిళిత వృద్ధి - ఆసియా, ప్రపంచానికి అనుసంధానం" అనే ఇతివృత్తంతో జరిగే రూట్స్ ఏషియా 2027పై భారత దార్శనికతను వివరించారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా ప్రపంచంలో మూడో అతిపెద్ద విమానయాన మార్కెట్‌గా ఎదిగే దిశగా భారత్ ముందుకు సాగుతున్న తరుణంలో ఈ కార్యక్రమం సరైన సమయంలో జరుగుతోందని ఆయన పేర్కొన్నారు.

"రూట్స్ ఏషియా 2027 సరైన ప్రదేశానికి, సరైన సమయంలో, సరైన అవకాశంతో వస్తోంది! మరింత విమానయాన సామర్థ్యానికి, మరిన్ని విమానయాన సంస్థలకు, మరిన్ని విమాన మార్గాలకు అవకాశం ఉంది" అని ఆయన అన్నారు.

166 పైగా విమానాశ్రయాలతో పాటు, వచ్చే పదేళ్లలో మరో 100 విమానాశ్రయాలను అభివృద్ధి చేయాలన్న ప్రణాళికలతో భారత్ విమానయాన రంగం వేగంగా విస్తరిస్తోంది. మరిన్ని నగరాలను, ప్రజలను అభివృద్ధి చెందుతున్న మార్కెట్లతో అనుసంధానించగల హబ్ - అండ్ - స్పోక్ విధానానికి విధానం ప్రాధాన్యం పెరుగుతోందని మంత్రి పేర్కొన్నారు. ఇది విమానయాన సంస్థలు, పర్యాటకం, ఆర్థిక వృద్ధికి కొత్త అవకాశాలను సృష్టిస్తుందని అన్నారు.





ఆహ్వానం

కవి సమ్మేళనం మరియు "ఓ తల్లి తీర్పు" కథల సంపుటి ఆవిష్కరణ

తేదీ: 03.10.2026

సమయం: సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు

వేదిక: సుందరయ్య భవన్. ప్రగతి నగర్, మిథిలా నగర్ కమాన్, హైదరాబాద్ -90

నిర్వహించువారు

సాదనాల వేంకట స్వామి నాయుడు, కన్వీనర్, అక్షర కుసుమాలు

రచయిత్రి శ్రీమతి తాడిమేటి శ్రీదేవి


# జైరోప్లేన్ పైలట్ల కోసం శిక్షణా విధానాన్ని ప్రవేశపెట్టిన డీజీసీఏ

న్యూఢిల్లీ, అక్టోబర్ 1: "జైరోప్లేన్ పైలట్ లైసెన్స్ జారీ కోసం గ్రౌండ్, ఫ్లయింగ్ శిక్షణ సిలబస్" పేరుతో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) కొత్త సివిల్ ఏవియేషన్ రిక్వైర్‌మెంట్ (సీఏఆర్-సెక్షన్ 7, సిరీస్ బి, పార్ట్ బీబీఎ)ను జారీ చేసింది.

డీజీసీఏ నుంచి జైరోప్లేన్ విభాగంలో పైలట్ లైసెన్స్ పొందాలనుకునే అభ్యర్థులకు అవసరమైన గ్రౌండ్, ఫ్లయింగ్ శిక్షణ పాఠ్యప్రణాళికను సీఏఆర్ ఖరారు చేస్తుంది.

జైరోప్లేన్‌లు ప్రత్యేక రకానికి చెందిన విమానాలు. ఇవి గాలిలో పైకి లేవడానికి స్వయంచాలకంగా తిరిగే రోటర్ వ్యవస్థను ఉపయోగిస్తాయి. అలాగే ముందుకు కదలడానికి కావాల్సిన శక్తిని ఒక ప్రొపెల్లర్ అందిస్తుంది. వీటిని ఎక్కువగా విహార యాత్రలు, విమాన అనుభవ ప్రయాణాలు, వ్యవసాయ పంటలపై మందుల పిచికారీ, బ్యానర్లను లాగడం, నిఘా, భూ సర్వే వంటి కార్యకలాపాలకు ఉపయోగిస్తారు.

భారత్‌లో జైరోప్లేన్‌ల వినియోగం, వాటి కార్యాచరణను సులభతరం చేసే దిశగా ఈ సివిల్ ఏవియేషన్ రిక్వైర్‌మెంట్స్ అమలు ఒక తొలి అడుగు. శిక్షణ సంస్థల స్థాపన, తయారీ, అసెంబ్లీ సామర్థ్యాల అభివృద్ధి వంటి తదుపరి చర్యలు.. పౌర విమానయాన రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ నూతన విభాగం వృద్ధికి తోడ్పడతాయి.

# అక్టోబరు 2 నుంచి 31వరకు 'స్పెషల్ క్యాంపెయిన్-6' నిర్వహణకు సిద్ధమైన బొగ్గు మంత్రిత్వశాఖ

న్యూఢిల్లీ, అక్టోబర్ 1:బొగ్గు మంత్రిత్వ శాఖ అక్టోబరు 2 నుంచి 31 వరకు అన్ని పరిపాలనా కార్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో స్పెషల్ క్యాంపెయిన్ - 6 ను నిర్వహించనుంది. "వ్యర్థాల నుంచి సంపద" అనే జాతీయ దార్శనికతకు అనుగుణంగా, నెల రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం శాస్త్రీయ పద్ధతిలో ఇ-వ్యర్థాలను తొలగించడం, స్క్రాప్ తొలగింపు, కార్యాలయ స్థలాల ఆప్టిమైజేషన్, కార్యాలయాల డిజిటలైజేషన్‌పై ప్రధానంగా దృష్టి సారిస్తుంది. తద్వారా సుస్థిరమైన, సమర్థమైన, పౌరులకు ప్రాధాన్యమిచ్చే పాలనను ప్రోత్సహిస్తుంది.

# కొత్త వాణిజ్య అవకాశాలతో అంతర్జాతీయ స్థాయికి భారత వ్యవసాయ ఉత్పత్తులు: శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 1:జాతీయ వ్యవసాయ సదస్సు-రబీ ప్రచారం 2026లో భాగంగా రెండో రోజు సమావేశానికి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షత వహించారు. వివిధ రాష్ట్రాల వ్యవసాయశాఖ మంత్రులు, ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ చౌహాన్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వం, మార్గదర్శకత్వంలో కేంద్రం, రాష్ట్రాలు పార్టీ రాజకీయాలకు అతీతంగా 'టీమ్ అగ్రికల్చర్' (వ్యవసాయ బృందం) స్ఫూర్తితో కలిసి పనిచేయాలని అన్నారు. దేశ ఆహార భద్రతను కాపాడడంతో పాటు రైతుల జీవనోపాధిని మెరుగుపరచేందుకు సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. "ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు వస్తుంటాయి, పోతుంటాయి. పార్టీలు ఏర్పడతాయి, రద్దవుతాయి. కానీ దేశం, రైతులు శాశ్వతం" అని ఆయన అన్నారు. వ్యవసాయాన్ని మెరుగుపరచడం, రైతుల ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఆచరణాత్మక మార్గాలను కనుగొనడమే ఈ వేదిక ఉద్దేశమని, ఇది రాజకీయాలకు సంబంధించిన వేదిక కాదని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రతి కీలక విధాన నిర్ణయం, అంతర్జాతీయ ఒప్పందంలోనూ రైతుల ప్రయోజనాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు శ్రీ చౌహాన్ తెలిపారు. సదస్సులో ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (పీఎం-ఆర్‌కేవీవై కింద 10 రాష్ట్రాల వ్యవసాయ మంత్రులకు రూ.1,200 కోట్లకు పైగా నిధుల మంజూరు పత్రాలను శ్రీ చౌహాన్ అందజేశారు. కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ శాఖ సహాయ మంత్రులు శ్రీ రామ్‌నాథ్ ఠాకూర్, శ్రీ భగీరథ్ చౌదరి, వ్యవసాయ కార్యదర్శి శ్రీ అతీష్ చంద్ర, ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎంఎల్ జాట్, కేంద్రం, రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, వివిధ వ్యవసాయ సంస్థల ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు.

పీఎం-ఆర్‌కేవీవై పథకం కింద 10 రాష్ట్రాలకు నిధుల మంజూరు పత్రాలను అందజేశారు. ఇందులో పశ్చిమ బెంగాల్‌కు రూ.290 కోట్లు, హర్యానాకు రూ.198 కోట్లు, ఛత్తీస్‌గఢ్‌కు రూ.181 కోట్లు, అరుణాచల్‌ప్రదేశ్‌కు రూ.154 కోట్లు, బిహార్‌కు రూ.114 కోట్లు, కర్ణాటకకు రూ.104 కోట్లు, మిజోరాంకు రూ.75 కోట్లు, హిమాచల్‌ప్రదేశ్‌కు రూ.64 కోట్లు, జార్ఖండ్‌కు రూ.58 కోట్లు, పంజాబ్‌కు రూ.43 కోట్లు ఉన్నాయి.

కేంద్ర ప్రభుత్వం కేవలం విధానాలను రూపొందించడానికే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో పథకాల అమలు ఎలాంటి ఆలస్యం లేకుండా ప్రారంభమయ్యేలా సకాలంలో నిధులు, అవసరమైన వనరులు అందేలా చర్యలు తీసుకుంటోందని శ్రీ చౌహాన్ తెలిపారు.

దేశ వ్యవసాయ రంగ పనితీరును శ్రీ చౌహాన్ ప్రస్తావిస్తూ.. 2015 నుంచి వ్యవసాయ వృద్ధి రేటు 3 శాతం నుంచి 4.5 శాతానికి పెరిగిందని తెలిపారు. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో సగటు వార్షిక పెరుగుదల కూడా రెండింతలకు పైగా పెరిగిందని, గతంలో ఏడాదికి సుమారు 40 లక్షల టన్నులుగా ఉన్న ఈ పెరుగుదల ప్రస్తుతం 84 లక్షల టన్నులకు చేరిందని చెప్పారు. అలాగే కేవలం రెండేళ్ల వ్యవధిలో 2023-24 నుంచి 2025-26 మధ్య రబీ ఆహార ధాన్యాల ఉత్పత్తి 205 లక్షల టన్నుల మేర గణనీయమైన పెరుగుదల నమోదైందని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖలు, శాస్త్రవేత్తలు, రైతుల సమష్టి కృషి వల్లే ఈ చారిత్రాత్మక వృద్ధి సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.

సహకార సమాఖ్య విధానాన్ని మరింత బలోపేతం చేసేందుకు కొత్త విధానాన్ని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రకటించారు. కేంద్రంలో ప్రతి వారం నిర్వహించే సమీక్షల తరహాలో ఇకపై రాష్ట్రాలతో ప్రతి నెలా క్రమం తప్పకుండా వర్చువల్ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. పురోగతిని నిరంతరం సమీక్షిం చడమే వీటి ఉద్దేశమని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో వ్యవసాయ మంత్రి, వ్యవసాయ శాఖ కార్యదర్శి, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ఐసీఏఆర్ సంస్థలు, కృషి విజ్ఞాన్ కేంద్రాలు (కేవీకేలు), ఏటీఎంఏ, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీఓలు), ప్రగతిశీల రైతులు, ప్రాసెసర్లు, ఎగుమతిదారులు, భారత ప్రభుత్వ నోడల్ అధికారులు కలిసి పనిచేసేలా బలమైన రాష్ట్ర వ్యవసాయ బృందాన్ని ఏర్పాటు చేయనున్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (డీడీఏ) ,ఏటీఎంఏ, కేవీకేలు, ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు, బ్యాంకర్లు, రైతులతో నెలవారీ సమావేశాలు నిర్వహించనున్నారు.

వ్యవసాయ కార్యక్రమాలకు ముందుగానే సన్నద్ధం కావడానికి వ్యవసాయ శాఖల సమన్వయ సమావేశాల కోసం వార్షిక క్యాలెండర్‌ను కేంద్ర మంత్రి శ్రీ చౌహాన్ ప్రకటించారు. ఖరీఫ్ సీజన్ కోసం ప్రతి సంవత్సరం మే 10న జిల్లా స్థాయి సమావేశాలు, మే 17న రాష్ట్ర స్థాయి సమావేశాలు నిర్వహించనున్నారు. రబీ సీజన్ కోసం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 10న జిల్లా స్థాయి సమావేశాలు, సెప్టెంబర్ 17న రాష్ట్ర స్థాయి సమావేశాలు నిర్వహించనున్నారు. వీటితో పాటు రైతుల సమస్యలపై చర్చించేందుకు వ్యవసాయ మంత్రులు, అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలను ఒకే వేదికపైకి తీసుకువస్తూ, దేశవ్యాప్తంగా ఒకే రోజున ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు.

నేల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని వివరిస్తూ.. ఈ ఏడాది అక్టోబర్ 22 నుంచి నవంబర్ 30 వరకు దేశవ్యాప్తంగా 'ఖేత్ బచావో అభియాన్' నిర్వహించాలని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, సంబంధిత అన్ని వర్గాల ప్రతినిధులు పాల్గొంటారు. భూసార ఆరోగ్య కార్డుల ఆధారంగా నేల సారాన్ని, ప్రయోజనకరమైన కీటకాలను రక్షించేందుకు, ఎరువులను సమతుల్యంగా వినియోగించేలా ఈ కార్యక్రమం ప్రోత్సహిస్తుంది. వరి కోత అనంతరం తూర్పు భారత్‌లోని వరి మాగాణి ప్రాంతాల్లో ముఖ్యంగా జార్ఖండ్, బిహార్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో పప్పుధాన్యాల సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని కూడా ఆయన పిలుపునిచ్చారు.

ప్రస్తుత రబీ సీజన్‌కు సన్నాహాల్లో భాగంగా పంటల ఎంపిక, మెరుగైన విత్తనాలపై సిఫారసులు నేలలోని తేమ, నీటి లభ్యత ఆధారంగా ఉండాలని శ్రీ చౌహాన్ స్పష్టం చేశారు. పంటలను వ్యాధులు, చీడపీడల నుంచి రక్షించేందుకు సమర్థవంతమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్రాలను ఆదేశించారు. అర్హులైన రైతులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులు (కేసీసీలు) అందేలా చర్యలు తీసుకోవాలని, పంటల బీమా పథకం కింద పారదర్శకంగా పంట కోత ప్రయోగాలు (సీసీఈలు) నిర్వహించాలని సూచించారు. శాఖల పథకాల అమలుపై రాష్ట్ర మంత్రులు స్వయంగా క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలని కూడా ఆయన స్పష్టం చేశారు.

దేశంలో విత్తనాలు, ఎరువుల లభ్యత తగినంతగా ఉందని శ్రీ చౌహాన్ పేర్కొన్నారు. నకిలీ ఎరువులు, నాసిరకం విత్తనాలు, నాణ్యత లేని పురుగుమందులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలను ఆదేశించారు. అలాగే బలవంతపు ట్యాగింగ్‌ను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. వ్యవసాయాన్ని మరింత సుస్థిరంగా, రైతులకు లాభదాయకంగా మార్చేందుకు సహజ వ్యవసాయం, సమీకృత వ్యవసాయ విధానాలు, పంటల వైవిధ్యీకరణను మిషన్ మోడ్‌లో అమలు చేయాలని రాష్ట్రాలను కోరారు.

రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులకు నాణ్యమైన, గిట్టుబాటు ధరలు పొందేలా ప్రభుత్వం బహుముఖ వ్యూహాన్ని అమలు చేస్తోందని కేంద్రమంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. పంట కోత అనంతర నిర్వహణను బలోపేతం చేయడం, శాస్త్రీయ పద్ధతుల్లో గిడ్డంగుల నిర్వహణ, మార్కెటింగ్ వ్యవస్థలను మెరుగుపరచడం ఈ వ్యూహంలో భాగమని చెప్పారు. కందులు, మినుములు, మసూర్ పప్పులను కనీస మద్దతు ధరకు 100 శాతం ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని, ఇందుకు సంబంధించిన చెల్లింపులు 48 గంటల్లో జరిగేలా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా అంతర్జాతీయ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏల) ద్వారా ఏర్పడుతున్న కొత్త మార్కెట్ అవకాశాలను బ . ా ం ్ త ్ వినియోగించుకుంటుందని చెప్పారు. భారత వ్యవసాయ ఉ

# ఎఫ్‌సీఆర్ఏ నమోదులో సాయం చేయడానికి లంచం అడిగిన ఇద్దరు అధికారుల అరెస్టు

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 1:హోం వ్యవహారాల శాఖకు నిర్దిష్ట సమాచారం అందడంతో, ఢిల్లీ పోలీసు ప్రత్యేక విభాగం నిన్న న్యూఢిల్లీలో ఇద్దరు ప్రభుత్వ అధికారులను అరెస్టు చేసింది. దీనిలో కేంద్రీయ ఏజెన్సీలు కూడా సహకారాన్ని అందించాయి.

అరెస్టు చేసిన ఇద్దరు అధికారుల్లో ఒకరు సీనియర్ అకౌంటెంట్, మరొకరు అకౌంటెంట్. వారు ఫారిన్ కరెన్సీ రెగ్యులేషన్ యాక్టు (ఎఫ్‌సీఆర్ఏ) కింద ఒక సంఘాన్ని నమోదు చేసేందుకు లంచం అడిగారన్న ఆరోపణలు వచ్చాయి.

అధికారుల్లో ఒకరు ప్రస్తుతం హోం శాఖకు చెందిన విదేశీయుల విభాగంలో పనిచేస్తుండగా, మరొకరు పే అండ్ అకౌంట్స్ కార్యాలయంలో పనిచేస్తున్నారు. రెండో అధికారి ఇంతకు ముందు విదేశీయుల విభాగంలో పనిచేశారు. కొన్ని సంఘాలతో వారు పరిచయం ఏర్పరుచుకొని, నమోదు ప్రక్రియను పూర్తి చేయడానికి, నవీకరణకు సాయపడటానికి చట్టవిరుద్ధంగా చెల్లింపులను అందుకోదలచినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడి అయింది. దీనిపై మరింత క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నారు.

హోం శాఖ అవినీతికి ఆమడ దూరంలో ఉండే విధానాన్ని అవలంబిస్తోంది. ఈ వ్యవహారంలో తగిన చట్టపరమైన చర్యలకు తోడు, విభాగం పరంగా కూడా చర్యలను తీసుకొంటున్నారు. ఎఫ్‌సీఆర్ఏకు సంబంధించిన సేవలు అన్నిటినీ ఎఫ్‌సీఆర్ఏ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్లో అందజేస్తున్నారు. ఎఫ్‌సీఆర్ఏకు సంబంధించిన ఏ విధమైన సేవలను నమకూర్చడంలోనైనా మధ్యవర్తులకు, ఏజెంట్లకు, లేదా వ్యక్తులకు ఎలాంటి అధికారాలనూ ఇవ్వలేదని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

# స్టాటిస్టికల్ బిజినెస్ రిజిస్టరును రూపొందించి, బలోపేతం చేయడానికి అవగాహన ఒప్పందం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 1: స్టాటిస్టికల్ బిజినెస్ రిజిస్టర్ (ఎస్‌బీఆర్)ను రూపొందించి, బలోపేతం చేయడానికి తత్సంబంధిత సమాచారాన్ని పంచుకోవడంతో పాటు ఒక యంత్రాంగాన్ని కూడా ఏర్పాటు చేయనున్నారు. దీని కోసం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎమ్ఎస్ఎమ్ఈ) మంత్రిత్వ శాఖ, గణాంకాలు–కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ (ఎమ్ఓఎస్‌పీఐ) ఒక అవగాహన ఒప్పందాన్ని (ఎమ్ఓయూ) ఇచ్చిపుచ్చుకున్నాయి.

అవగాహన ఒప్పంద పత్రంపై ఎమ్ఎస్ఎమ్ఈ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, డెవలప్‌మెంట్ కమిషనరు డాక్టర్ రజనీశ్, ఎమ్ఓఎస్‌పీఐ అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ దలీప్ సింగ్ సంతకాలు చేశారు. రెండు మంత్రిత్వ శాఖలకు చెందిన సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎమ్ఎస్ఎమ్ఈ విభాగం వద్ద ఉన్న ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన యూనిట్ వారీ సమాచారాన్ని ఎమ్ఎస్ఎమ్ఈ మంత్రిత్వ శాఖ, ఎమ్ఓఎస్‌పీఐలు ఏపీఐల సాయంతో పంచుకోవడానికి షరతులను, అవగాహనను ఈ ఎమ్ఓయూ నిర్ధేశిస్తుంది. నేషనల్ స్టాటిస్టికల్ బిజినెస్ రిజిస్టర్ (ఎన్ఎస్‌బీఆర్)ను రూపొందించడానికి అవసరమైన సమాచారాన్ని ఈ రెండు పక్షాల ఏపీఐ సమకూరుస్తుంది.

ఎమ్ఎస్ఎమ్ఈ మంత్రిత్వ శాఖకు చెందిన ఉద్యమ్ రిజిస్ట్రేషన్ విస్తారిత అనుబంధ వ్యవస్థ నుంచి సంబంధిత సమాచారాన్ని గణాంకాలు–కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖతో కలిసి పంచుకోవడానికి ఓ సువ్యవస్థిత ఫ్రేంవర్కును సిద్ధం చేయడానికి ఈ ఒప్పందం తోడ్పడుతుంది. గణాంక లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని ఉపయోగించే బిజినెస్ సమాచార విస్తృతి, ఏకరూపత, విశ్వసనీయతలను మెరుగుపరచడానికి ఈ సమాచారం దోహదం చేస్తుంది.

స్టాటిస్టికల్ బిజినెస్ రిజిస్టర్ (ఎస్‌బీఆర్) ఒక కేంద్రీయ, నిర్దిష్ట కాల ప్రాతిపదికన తాజా సమాచారాన్ని పొందుపరుస్తూ ఉండే సమాచార నిధి (డేటా బేస్). దీనిలో ఒక పారిభాషిక భౌగోళిక క్షేత్ర పరిధిలో ఆర్థిక కార్యకలాపాల్లో నిమగ్నమైన నమోదిత గణాంక యూనిట్ల వివరాలు ఉంటాయి.

దీనిలో వ్యాపార, వాణిజ్య, ఇతర సందర్భశుద్ధి కలిగి ఉండే ఆర్థిక విభాగాలు, ఆర్థిక విభాగాల ప్రధాన విశేషాలు, వివిధ విభాగాల మధ్య ఉండే సంబంధాలను నమోదు చేస్తారు.

ఆర్థిక గణాంకాల వ్యవస్థకు ఒక మూలాధార మౌలిక సదుపాయంగా ఎస్‌బీఆర్ పనిచేస్తుంది. దీని వల్ల ఆర్థిక సర్వేలకు లక్షిత జనాభాను గుర్తించి, సర్వే నమూనాను ఎంపిక చేయడానికి తోడ్పడడం, బిజినెస్ డెమోగ్రఫీ స్టాటిస్టిక్స్ రూపకల్పనకు దోహదం చేయడం, బిజినెస్ డెమోగ్రఫీకి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవడానికి ఒక ఉమ్మడి ఫ్రేంవర్కును సమకూర్చడం, వివిధ సమాచార మూలాల్లో (డేటా సోర్సెస్) ఏకీకరణకు, స్థిరత్వానికి మార్గాన్ని సుగమం చేసి వ్యాపార సమాచార కవరేజిని, సుస్థిరతను, విశ్వసనీయతను మెరుగుపరిచేందుకు వీలవుతుంది.

# 'యూట్యూబ్ ఇంపాక్ట్ సమ్మిట్-2026'లో వికసిత భారత్ సాకారంలో 'క్రియేటర్ ఎకానమీ'.. కృత్రిమ మేధ పాత్ర కీలకం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 1:దేశంలోని యువ కంటెంట్ క్రియేటర్ల ఆవిష్కరణ–సాధికారత దిశగా కృత్రిమ మేధను (ఏఐ) ఒక ఉపకరణంగా సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర సమాచార–ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ సూచించారు. "'ఏఐ'తో సృష్టికర్తల వైరుధ్యం'గా భవిష్యత్తు మారకూడదు క్రియేటర్లకు సాధికారతనిచ్చే సాధనంగా 'ఏఐ' ఉపయోగపడాలి" అన్నారు. ఈ మేరకు "సృజన దిశగా సాహసంతో సాగండి? బాధ్యతతో, నిర్దిష్ట లక్ష్యంతో సృజనాత్మకతను చాటుకోండి'' అని పిలుపునిచ్చారు. అలాగే, "సాంకేతికత వేగంగా రూపాంతరం చెందుతున్నప్పటికీ, రాజ్యాంగ విలువ శాశ్వతంగా నిలవడం ప్రధానమన్నది గమనించాలి'' అని స్పష్టం చేశారు.

న్యూఢిల్లీలో ఇవాళ "సహ–సృజనాత్మక ప్రభావం: భారత డిజిటల్ నేతృత్వం.. సృజనార్థిక వ్యవస్థ" ఇతివృత్తంగా నిర్వహించిన 'యూట్యూబ్ ఇంపాక్ట్ సమ్మిట్–2026'లో డాక్టర్ ఎల్.మురుగన్ ప్రధానోపన్యాసం చేశారు. ఆర్థిక వృద్ధి, ఉపాధి, ప్రపంచ సాంస్కృతిక విస్తరణకు మార్గనిర్దేశంలో భారత డిజిటల్–సృజనార్థిక వ్యవస్థ పాత్ర ఇనుమడిస్తున్నదని ఆయన ప్రస్ఫుటం చేశారు. విధాన రూపకర్తలు, సాంకేతిక అగ్రగాములు, క్రియేటర్లు, పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలను ఈ సదస్సు ఒకే వేదికపైకి తెచ్చింది. ఈ సదస్సులో భాగంగా 'యూట్యూబ్ ఇంపాక్ట్ రిపోర్ట్'ను ఆయన ఆవిష్కరించారు. దీని ప్రకారం– యూట్యూబ్ సృజనావరణ వ్యవస్థ 2025లో భారత జీడీపీకి –18,000 కోట్లకు పైగా విలువను జోడించింది. అలాగే, దేశవ్యాప్తంగా 9.6 లక్షలకు పైగా పూర్తికాలపు ఉద్యోగాల స్థాయిలో క్రియేటర్లకు మద్దతిచ్చింది. దీనిపై మంత్రి స్పందిస్తూ– దేశంలో రూపొందే కంటెంట్ వీక్షణ సమయంలో 15 శాతానికి పైగా దేశం వెలుపలి వీక్షకుల ద్వారానే నమోద వుతోందన్నారు. అలాగే భారతీయ యూట్యూబ్ ఛానెళ్ల సంఖ్య 18,000 దాటగా, ఒక్కొకదానికి చందాదారుల సంఖ్య 10 లక్షల స్థాయిని అధిగమించిందని చెప్పారు.

డిజిటల్ చెల్లింపులు, సార్వజనీన డిజిటల్ మౌలిక సదుపాయాలు, అంకురాలు, కృత్రిమ మేధ, చౌకగా అనుసంధానం, డిజిటల్ విద్య తదితరాల ద్వారా భారత్‌లో డిజిటల్ రూపాంతరీకరణను డాక్టర్ మురుగన్ ప్రముఖంగా ప్రస్తావించారు. వినియోగదారుల నుంచి క్రియేటర్లుగా, ఆవిష్కర్తలుగా, మేధో సంపత్తి సృష్టి దిశగా యువత పయనించాల్సిన అవసరం ఎంతయినా ఉందన్నారు. అవకాశాల రూపురేఖలను డిజిటల్ సాంకేతికత పూర్తిగా మార్చేసిందన్నారు. తద్వారా ప్రతి జిల్లా, భాష, వర్గాల ప్రతిభావంతులంతా అంతర్జాతీయ వీక్షకులను చేరే వీలు కల్పిస్తోందని చెప్పారు.

"భారత్‌లో సృష్టించండి ప్రపంచం కోసం సృష్టించండి" అంటూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన దార్శనికతను డాక్టర్ మురుగన్ ప్రస్తావించారు. సృజనార్థిక వ్యవస్థకు కంటెంట్, సృజనాత్మకత, సంస్కృతి మూలస్తంభాలని పేర్కొన్నారు. వినోదానికి అతీతంగా సృజనాత్మకత విస్తరించిందని ఆయన అన్నారు. ఈ క్రమంలో అది ఉద్యోగాలు, వ్యాపారాలు, మేధో సంపత్తి, ఎగుమతులు, సాంస్కృతిక ప్రభావ విస్తరణకు దోహదం చేయగలదని చెప్పారు. రచన, అనువాదం, ఎడిటింగ్, యానిమేషన్, కంపోజిషన్, డిజైన్, పంపిణీలో క్రియేటర్లకు ఏఐ సహాయపడగలదని డాక్టర్ మురుగన్ అన్నారు. అయితే, సృజనాత్మకతకు మానవ ఊహాశక్తి కేంద్రకమని, కృత్రిమ మేధ క్రియేటర్ల స్థానం ఆక్రమించేదిగా కాకుండా వారికి సాధికారత కల్పించేదిగా ఉండాలని ఆయన పునరుద్ఘాటించారు. అదే సమయంలో అత్యాధునిక సాంకేతికతలను అందరికీ అందుబాటులో ఉండేలా, బాధ్యతాయుతంగా, నైతికంగా వాడాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. ఈ సదస్సులో భాగంగా 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్' (ఐఐసీటీ) సహకారంతో రూపొందించిన "క్రియేట్ విత్ ఏఐ" చిత్రాలను మంత్రి ఆవిష్కరించారు.

సృజనాత్మకతకు గుర్తింపు, ప్రోత్సాహం, మార్కెట్లతో అనుసంధాని దిశగా వివిధ మార్గాల బలోపేతానికి ఉద్దేశించిన ప్రభుత్వ కార్యక్రమాలను మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ మేరకు "వేవ్స్, ఐఐసీటీ, క్రియేట్ ఇన్ ఇండియా పోటీలు, జెమ్స్ ఆఫ్ ఇండియా, వేవ్స్ బజార్, మైవేవ్స్, క్రియేటర్స్ కార్నర్" తదితరాలను ఆయన ఉదాహరించారు.

మరోవైపు దేశంలోని 15,000 మాధ్యమిక పాఠశాలలు, 500 కళాశాలల్లో ఏవీజీసీ కంటెంట్–క్రియేటర్ ప్రయోగ శాలల కోసం కేంద్ర బడ్జెట్ 2026–27లో విస్తృత కేటాయింపులు చేసినట్లు ఆయన గుర్తుచేశారు. ఈ పరిశ్రమకు 2030 నాటికి దాదాపు 20 లక్షల మంది నిపుణులు అవసరమని అంచనా వేస్తున్నట్లు ఆయన తెలిపారు.

"సాంకేతికత వేగంగా మారుతుందన్నది నిజమేగానీ, రాజ్యాంగ విలువలు మాత్రం శాశ్వతం" అని డాక్టర్ మురుగన్ స్పష్టం చేశారు. భారత డిజిటల్ రూపాంతరీకరణలో న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాత్రం ప్రాధాన్యాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన స్వేచ్ఛను ప్రస్తావిస్తూ– సహేతుక రాజ్యాంగ పరిమితులకు లోబడి, సృజనాత్మక స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా అత్యావశ్యకమని ఆయన స్పష్టీకరించారు. అంతేకాకుండా నేటి డిజిటల్ యుగంలో బాధ్యతాయుత సృజన, ఆదానప్రదానం, ధ్రువీకరణ, ఆవిష్కరణల దిశగా పిలుపునిస్తూ, ఆర్టికల్ 51ఎ కింద ప్రాథమిక విధులను కూడా ప్రముఖంగా ఉటంకించారు.

సినిమా, సంగీతం, గేమింగ్, యానిమేషన్, డిజిటల్ స్టోరీటెల్లింగ్, డిజైన్, హస్తకళలు, సాహిత్యం ద్వారా భారత సుసంపన్న సాంస్కృతిక వారసత్వం కొత్త ప్రేక్షకులకు చేరువ కాగలదని డాక్టర్ మురుగన్ చెప్పారు. యువ క్రియేటర్లను ఉద్దేశించి మాటాడుతూ– వారి భాష, సంస్కృతి, కథలు ప్రపంచవ్యాప్తం కాగలవని, ఆ మేరకు దేశ వైవిధ్యంపై విశ్వాసంతో కంటెంట్ సృష్టి సాగాలని సూచించారు. వికసిత భారత్–2047 దిశగా ఉపాధి, మేధా సంపత్తి, అంతర్జాతీయ అవకాశాలు, సార్వజనీన వృద్ధి ప్రాధాన్యాన్ని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో దేశం సాంకేతికతతో ఏం సృష్టిస్తుందనే దానిపై భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని మంత్రి అన్నారు.

వికసిత భారత్ దిశగా ప్రస్థానంలో భారత డిజిటల్, సృజనాత్మక పరిశ్రమల పాత్ర విస్తరిస్తుండటాన్ని ఈ సదస్సు ప్రముఖంగా ప్రస్తావించింది. ఈ సందర్భంగా సమ్మిళిత, ప్రపంచ పోటీతత్వ, సృజనావరణ వ్యవస్థ రూపకల్పనకు సమష్టిగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూట్యూబ్ ఇండియా కంట్రీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి గుంజన్ సోని, యూట్యూబ్ గ్లోబల్ గవర్నమెంట్ అఫైర్స్ అండ్ పబ్లిక్ పాలసీ వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి లెస్లీ మిల్లర్, సమాచార–ప్రసార మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ సెంథిల్ రాజన్ కూడా పాల్గొన్నారు.

# ఇంటి పైకప్పుపై సోలార్.. విద్యుత్ బిల్లుకు చెక్




ఖమ్మం, అక్టోబర్ 1: ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత్ బిజిలీ పథకానికి సంబంధించిన బ్రోచర్‌ను వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పథకం ద్వారా అందించే సబ్సిడీ, సోలార్ విద్యుత్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను ఆమె వివరించారు.

ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత్ బిజిలీ పథకం కింద ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసుకుని విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చని చంద్రకళ తెలిపారు. అర్హతను బట్టి రూ.78 వేల వరకు సబ్సిడీ పొందవచ్చన్నారు. నెలకు 300 యూనిట్ల వరకు విద్యుత్ ప్రయోజనం పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు.

అవసరానికి మించి విద్యుత్ ఉత్పత్తి అయితే నిబంధనల ప్రకారం గ్రిడ్‌కు విక్రయించవచ్చని తెలిపారు. గ్రూప్ హౌసింగ్ సొసైటీలకు కూడా ఈ పథకం కింద సబ్సిడీ వర్తిస్తుందని చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ వంటి అవసరాలకు కూడా సౌర విద్యుత్‌ను వినియోగించుకోవచ్చన్నారు.

ఒకసారి సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసుకుంటే సుమారు 25 ఏళ్ల వరకు విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉంటుందని చంద్రకళ తెలిపారు. గృహ యజమానులు తమ ఇంటి పైకప్పుపైనే సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసుకుని అవసరమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చన్నారు. ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా సంవత్సరానికి రూ.75 వేల కోట్ల వరకు ఆదా అవుతుందని ప్రభుత్వ అంచనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ చింతనిప్పు సులోచన, విద్యుత్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దేశీయంగా మల్టీ-గ్యాస్ సెన్సింగ్ ప్లాట్‌ఫామ్ తయారీకిరూ. 37.51 కోట్ల ఆర్‌డీఐ మద్దతు కోసం 'మల్టీ నానో సెన్స్ టెక్నాలజీస్'తో ఒప్పందం కుదుర్చుకున్న టీడీబీ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 1:పారిశ్రామిక భద్రత, హైడ్రోజన్ మౌలిక సదుపాయాల నుంచి ఇంధన వ్యవస్థలు, ప్రక్రియ పర్యవేక్షణ వరకు వాయువులను గుర్తించడం, వాటిని కచ్చితంగా కొలవడం వంటి సామర్థ్యాలు అనేక రకాల వర్ధమాన సాంకేతికతలు రోజు రోజుకూ ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంటున్నాయి. ఈ రంగంలో స్వదేశీ సామర్థ్యాలను పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక శాఖ (డీఎస్‌టీ) ఆధ్వర్యంలోని టీడీబీ (టెక్నాలజీ డెవలప్‌మెంట్ బోర్డు) మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన మల్టీ నానో సెన్స్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణ (ఆర్‌డీఐ) నిధి కింద రూ. 37.51 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించే ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. మొత్తం రూ. 75.02 కోట్ల ఆమోదిత వ్యయంతో కూడిన ఈ ప్రాజెక్ట్ 'ప్లాట్‌ఫార్మ్ ఎంఈఎంఎస్ + ఏఎఫ్ఈ ఎస్ఓసీ మల్టీ–గ్యాస్ సెన్సార్' అభివృద్ధిపై దృష్టి పెడుతుంది. ఈ సాంకేతికతను టీఆర్ఎల్–4 నుంచి టీఆర్ఎల్–9 స్థాయికి తీసుకెళ్లడం దీని ప్రధాన లక్ష్యం. ఆప్షనల్లీ కన్వర్టబుల్ డెట్(ఓసీడీ) ద్వారా ఈ ఆర్థిక సహాయం అందుతుంది.

చిన్న పరిమాణంలో నమ్మదగిన, విస్తరించదగిన మల్టీ–గ్యాస్ సెన్సింగ్‌ను సులభతరం చేసే లక్ష్యంతో మల్టీ నానో సెన్స్ సంస్థ స్వదేశీ ఎంఈఎంఎస్ టీసీడీఐఆర్ గ్యాస్ సెన్సార్, సీఎంఓఎస్ ఏఎఫ్ఈ ఎస్ఓసీ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేస్తోంది. ఈ సాంకేతికత ఎంఈఎంఎస్ ఆధారిత సెన్సింగ్ మూలకాన్ని సిగ్నల్ సముపార్జన, ప్రాసెసింగ్ కోసం అప్లికేషన్–నిర్దిష్ట ఫ్రంట్–ఎండ్ సిస్టమ్–ఆన్–చిప్‌తో మిళితం చేస్తుంది. రిఫైనరీలు, పెట్రోకెమికల్స్, పవర్, పీఎన్‌జీ మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక భద్రత, బ్యాటరీలు, హైడ్రోజన్ ఎకానమీతో సహా వివిధ పరిశ్రమల్లో సంభావ్య అనువర్తనాలతో లీక్ డిటెక్షన్, ప్రక్రియ నియంత్రణ, హెల్త్ అండ్ సేఫ్టీ మానిటరింగ్ వంటి అప్లికేషన్ల కోసం ఈ ప్లాట్‌ఫామ్ ఉపయోగపడుతుంది.

ప్రతిపాదిత సెన్సార్ ప్లాట్‌ఫామ్ అధిక సెన్సిటివిటీ, తక్కువ విద్యుత్ వినియోగం, సూక్ష్మీకరించిన– ఇంటెలిజెంట్ సిగ్నల్ ప్రాసెసింగ్ కలయికతో పాటు ఎంఈఎంఎస్ గ్యాస్ సెన్సార్, కస్టమ్ ఏఎఫ్ఈ ఎస్ఓసీలతో రూపొందించారు. ఈ సాంకేతికత విస్తృత ఉష్ణోగ్రత శ్రేణిలో, కష్టతరమైన పారిశ్రామిక వాతావరణాలలో పనిచేస్తుంది. అదే సమయంలో ఆటో–క్యాలిబ్రేషన్, పర్యావరణ ప్రమాణాల కోసం పరిహారం, పర్యావరణ పరిస్థితుల (ఉష్ణోగ్రత, తేమ మొదలైనవి) వల్ల కలిగే మార్పులను సరిదిద్దడం లేదా సర్దుబాటు చేయడం, సాఫ్ట్‌వేర్ ఆధారిత గ్యాస్–లైబ్రరీ ప్రాసెసింగ్ (వివిధ వాయువుల సమాచార నిధిని ఉపయోగించి విశ్లేషించడం) వంటి ఫీచర్లను ఇది కలిగి ఉంటుంది. 200 మిలీసెకన్ల కంటే తక్కువ ప్రతిస్పందన సమయాన్ని లక్ష్యంగా చేసుకొని వేగవంతమైన గుర్తింపు, పర్యవేక్షణ అవసరమయ్యే అప్లికేషన్ల కోసం ఈ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేస్తున్నారు. 25 మి.మీ.× 25 మి.మీ.× 15 మి.మీ. కన్నా తక్కువ పరిమాణంలో రూపొందించిన సెన్సార్ ప్యాకేజీతో కూడిన దీని చిన్న సైజు ఆర్కిటెక్చర్ బ్యాటరీతో నడిచే, ఎంబెడెడ్ అప్లికేషన్‌లకు అవకాశాన్ని కల్పిస్తుంది.

ఆర్‌డీఐ మద్దతుగల ఈ కార్యక్రమం ద్వారా మల్టీ నానో సెన్స్ సంస్థ సెన్సార్, ఏఎఫ్ఈ ఎస్ఓసీ ప్లాట్‌ఫామ్ తదుపరి అభివృద్ధి, ఇంటిగ్రేషన్, పరీక్ష, ధ్రువీకరణ, స్థాయి పెంపుదల వంటి ప్రక్రియలను చేపట్టగలదు. ఈ సాంకేతికతను టీఆర్ఎల్–9 స్థాయికి తీసుకెళ్లటమే దీని అంతిమ లక్ష్యం. ఈ ప్రాజెక్ట్ డీప్ టెక్నాలజీ కిందకు వస్తుంది. ఇందులో క్వాంటం సాంకేతికతను ఉప–రంగంగా గుర్తించారు. తక్షణ అప్లికేషన్ అధునాతన మల్టీ–గ్యాస్ సెన్సింగ్ అయినప్పటికీ దీని అంతర్లీన ప్లాట్‌ఫామ్ ఎంఈఎంఎస్, సెమీకండక్టర్ ఎలక్ట్రానిక్స్, ఇంటెలిజెంట్ సెన్సింగ్‌లను ఒకచోట చేర్చుతుంది. స్వదేశీ సాంకేతిక సామర్థ్యాలను పెంపొందించడానికి ఇవి ఎంతో ముఖ్యమైన రంగాలు.

టీడీబీ కార్యదర్శి శ్రీ రాజేష్ కుమార్ పాఠక్ మాట్లాడుతూ.. "అనేక ఆధునిక సాంకేతిక వ్యవస్థలకు సెన్సార్లు పునాది వంటివి. పారిశ్రామిక పోటీతత్వం, వ్యూహాత్మక ఆత్మనిర్భరత రెండింటికీ సెన్సింగ్, సెమీకండక్టర్ సాంకేతికతలలో స్వదేశీ సామర్థ్యాలు ఎంతో ముఖ్యం. వాణిజ్యపరంగా విస్తృతంగా ఉపయోగించే స్థాయికి చేరుకోవటానికి ముందు చాలా కాలం పాటు అభివృద్ధి అవసరమయ్యే సాంకేతికతలకు మద్దతు ఇవ్వడానికి ఆర్‌డీఐ నిధి మాకు సహాయపడుతుంది.

# మాడ్ మధిర సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ విజయవంతం

## 11 మండలాల్లో 27,700 మంది విద్యార్థులకు ప్రతిరోజూ పోషకాహార అల్పాహారం



ఖమ్మం, అక్టోబర్ 1:తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా మధిరలో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ విజయవంతంగా కొనసాగుతుంది. మధిరలో ఏర్పాటుచేసిన కిచెన్ను 2026 జూలై 27న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఆయన మార్గదర్శకత్వం, పర్యవేక్షణ, సహకారంతో ఈ కార్యక్రమం గత రెండు నెలలుగా విజయవంతంగా కొనసాగుతోంది.

మధిర సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ పరిధిలోని మధిర, ఎర్రుపాలెం, తల్లాడ, వైరా, కొణిజర్ల, వేంసూరు పెనుబల్లి, బోనకల్, కల్లూరు, చింతకాని, ముదిగొండ మండలాల్లోని 575 ప్రభుత్వ పాఠశాలలు, 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సుమారు 27,700 మంది విద్యార్థులకు ప్రతిరోజూ రుచికరమైన, పరిశుభ్రమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారం అందిస్తున్నారు. ఈ కార్యక్రమానికి హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా అమలు భాగస్వామిగా వ్యవహరిస్తోంది.

విద్యార్థులకు సమతుల్యమైన పోషకాహారం అందించేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ సహకారంతో అల్పాహార మెనూను రూపొందించారు. వారంలో వివిధ రకాల అల్పాహారాన్ని అందించడంతో పాటు, రోజు విడిచి రోజు వేడి పాలను కూడా అందిస్తున్నారు.

కేంద్రీకృత వంటశాలలో ఆధునిక పద్ధతులు, పరిశుభ్రమైన వంట విధానాలను అనుసరిస్తూ పెద్ద సంఖ్యలో విద్యార్థులకు అవసరమైన అల్పాహారాన్ని సమయానికి సిద్ధం చేస్తున్నారు. ఈ కిచెన్‌లో గంటకు 5,400 ఇడ్లీలు, 3,600 పూరీలు, 2,000 దోశలు తయారు చేసే సామర్థ్యం ఉంది. అనంతరం ప్రత్యేక వాహనాల ద్వారా ఆయా ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు అల్పాహారాన్ని సకాలంలో పంపిణీ చేస్తున్నారు.

ప్రాథమిక పాఠశాల (1?5 తరగతులు) విద్యార్థికి బ్రేక్‌ఫాస్ట్‌కు రూ.11.50, ఉన్నత పాఠశాల (6?10 తరగతులు) విద్యార్థికి రూ.13.50, జూనియర్ కళాశాల విద్యార్థికి బ్రేక్‌ఫాస్ట్‌కు రూ.13.50గా ప్రభుత్వం అందిస్తోంది. పాలకు రూ.1.08 చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. ఉదయం పూట పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా విద్యార్థులు ఆకలితో పాఠశాలకు రాకుండా చూడటం, వారి ఆరోగ్యం, ఏకాగ్రత, పాఠశాల హాజరు మెరుగుపడేలా చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం.

ఈ వంటశాల నిర్మాణానికి కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఉదారంగా నిధులు అందించి, కార్యక్రమానికి సహకరించిన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కు హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తోంది.

# టీపీసీసీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడిగా నక్క శ్రీనివాస్

నల్గొండ, అక్టోబర్ 1:: క్యాతన్‌పల్లి పట్టణ టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా రామకృష్ణాపూర్‌కు చెందిన నక్క శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు మంచిర్యాల జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పైడిమల్ల నర్సింగ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ నాయకత్వంలో, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి సూచనతో ఈ నియామకం చేపట్టినట్లు తెలిపారు.

క్యాతన్‌పల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఓడ్నాల శ్రీనివాస్ సహకారంతో నక్క శ్రీనివాస్‌ను పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమించినట్లు పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన నక్క శ్రీనివాస్‌కు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

# స్వర్ణగిరిలో ఘనంగా స్వామివారి సేవలు

నల్గొండ, అక్టోబర్ 1:స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్యక్షేత్రంలో గురువారం స్వామివారి విశేష పూజలు, ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. భాద్రపద మాసం, కృష్ణ పక్ష పంచమి పురస్కరించుకుని ఆలయంలో ప్రాతఃకాలం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక కైంకర్యాలు నిర్వహించారు. రోహిణి నక్షత్రం సందర్భంగా శ్రీ మదన వేణుగోపాల స్వామివారికి పాలు, పెరుగు, తేనె, పండ్ల రసాలు, చందనాదులతో 'నవ కలశ పూర్వక పంచామృతాభిషేకం' నిర్వహించారు. అంతకుముందు తెల్లవారుజామున సుప్రభాత సేవ, గోపృష్ఠ దర్శనం, బంగారు బావి నుంచి సువర్ణ బిందె తీర్థం తీసుకురావడం, తోమాల సేవ, విశేషంగా సహస్రనామార్చన సేవలను శాస్త్రోక్తంగా జరిపారు. లోక కళ్యాణార్థం శ్రీ సుదర్శన నారసింహ హవనం నిర్వహించారు.

సకల ప్రాణికోటికి ధాన్యాది సమృద్ధి కలగాలని కాంక్షిస్తూ గురువారం నైవేద్య సమయంలో తిరుప్పావడ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి సుమారు 450 కిలోల అన్నప్రసాదం, లడ్డు, వడలు నివేదించి హారతులు ఇచ్చారు. వైభవోత్సవ మండపంలో శ్రీ వేంకటేశ్వర స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు.

# జిల్లా హ్యాండ్‌బాల్ జట్లకు క్రీడాకారుల ఎంపిక




నిజామాబాద్, అక్టోబర్ 1: నిజామాబాద్ జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్‌ను స్థానిక ప్రెసిడెంట్ పాఠశాలలో నిర్వహించారు. ఈ ఎంపిక పోటీలకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా హాజరయ్యారు. ఒక్కో విభాగంలో సుమారు 14 జట్లు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాయి.

జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులను జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో నిర్వహించనున్న ఉమ్మడి జిల్లాల కంబైన్డ్ డిస్ట్రిక్ట్ పోటీల్లో పాల్గొంటారని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి అలివేణి మంగమ్మ తెలిపారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు రాబోయే ఉమ్మడి జిల్లాల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ పాఠశాల హెచ్‌ఎం పవన్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అలివేణి మంగమ్మ, వ్యాయామ ఉపాధ్యాయులు రమణ, రాజేష్, సునీత, మాధురి, మహమ్మద్ అజ్మత్ ఖాన్, శ్రీనివాస్, లక్ష్మణ్, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయానికే వన్నెతెచ్చిన నాయకుడు బిరుదు

### బడుగు బలహీన వర్గాల నేత రాజమల్లు
### ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు

కరీంనగర్, అక్టోబర్ 1: నియోజకవర్గంలో రాజకీయాలకు వన్నెతెచ్చిన మహోన్నత నాయకుడు మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు అని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. గురువారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ముందు మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు చౌరస్తా వద్ద జయంతిని పురస్కరిం చుకొని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి 76వ జన్మదిన వేడుకలను నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సుల్తానాబాద్ నుంచి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి సర్పంచ్, ఎంపీపీ, ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులుగా అనేక పదవులను అనుభవించి రాజకీయాలలో తనదైన ముద్రను వేశారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అనుచర గణంతోపాటు అభిమానులను సంపాదించుకున్న మహోన్నత వ్యక్తి బిరు దు రాజమల్లు అని కొనియాడారు. తాను కూడా రాజ మల్లన్నకు ప్రియ శిష్యుడినేనని, అవినీతికి తావు లేకుండా పాలనను అందించారని కొనియా డారు. ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. అనంతరం గత పదేళ్లుగా బిరుదు జయంతిని పురస్కరించుకొని నిరుపేదలకు అందిస్తున్న చీరలను మున్సిపల్ కార్యాలయ సిబ్బందికి అందించారు. అనంతరం రాజమల్లు కుటుంబ సభ్యులు, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మాజీ వైస్ చైర్మన్ బిరుదు సమతలు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిరుదు రాజమల్లు సతీమణి సుశీలతోపాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అనుచర గణం, వివిధ గ్రామాల సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, సింగిల్ విండో చైర్మన్‌లు, మార్కెట్ కమిటీ చైర్మన్ లు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# యూపీఎస్సీ శతాబ్ది వేడుకల సందర్భంగా స్మారక నాణెం, స్టాంపును విడుదల చేయనున్న ప్రధాని

న్యూఢిల్లీ, అక్టోబర్ 1:న్యూఢిల్లీలోని భారత్ మండపంలో2026 అక్టోబరు 1న నిర్వహించనున్న యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) శతాబ్ది ఉత్సవాల్లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పాల్గొనబోతున్నారు. ఉదయం 11 గంటల సమయంలో కార్యక్రమానికి హాజరు కానున్న ఆయన.. ఈ సందర్భంగా సభనుద్దేశించి ప్రసంగిస్తారు.

1926లో యూపీఎస్సీని నెలకొల్పి వందేళ్లు పూర్తయిన సందర్భంగా.. గతేడాది అక్టోబరు 1న ప్రారంభమై, ఏడాది పొడవునా సాగిన శతాబ్ది ఉత్సవాలు ఈ కార్యక్రమంతో ముగియనున్నాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని.. యూపీఎస్సీ శతాబ్ది స్మారక నాణేన్ని, స్మారక తపాలా బిళ్ళను, 'భారత్‌లో యూపీఎస్సీ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ల విధానాలకు రూపుదిద్దిన 100 కీలక తీర్పులు' అనే పుస్తకాన్ని ప్రధానమంత్రి ఆవిష్కరిస్తారు.

వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లు, సభ్యులు, భారత ప్రభుత్వ ఉన్నతాధికారులు, విద్యావేత్తలు, యూపీఎస్సీ అధికారులతోపాటు.. దేశవ్యాప్తంగా సంబంధిత భాగస్వామ్య పక్షాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు.

యూపీఎస్సీ 2026 సెప్టెంబరు 30, అక్టోబరు 1 తేదీల్లో నిర్వహిస్తున్న రెండు రోజుల ఉత్సవంలో ఈ కార్యక్రమం ఒక భాగం. మొదటి రోజు భారత్ మండపంలో 'శతాబ్ది సమరోహ్ – మంథన్' కార్యక్రమం ఉంటుంది. ప్రముఖ వక్తల ప్రసంగాలు, అనంతరం వివిధ అంశాలపై నిపుణుల బృందాల చర్చలు ఇందులో ఉంటాయి.




# వరల్డ్‌స్కిల్స్ షాంఘై 2026లో రెండు రజతాలు, ఒక ప్రావీణ్య పతకంతో సత్తా చాటిన ఎన్ఐఎఫ్‌టీ విద్యార్థులు

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 1:షాంఘై వేదికగా జరుగుతున్న 48వ వరల్డ్‌స్కిల్స్ పోటీలు-2026లో జాతీయ ఫ్యాషన్ టెక్నాలజీ సంస్థ (ఎన్ఐఎఫ్‌టీ) గణనీయమైన విజయాన్ని నమోదు చేసింది. ఫ్యాషన్ సాంకేతికత, డిజిటల్ ఇంటరాక్టివ్ మీడియా డిజైన్, రిటైల్ అమ్మకాలు, విజువల్ మర్కండైజింగ్ వంటి కీలక ఫ్యాషన్, సృజనాత్మక నైపుణ్య విభాగాల్లో ఎన్ఐఎఫ్‌టీ విద్యార్థులు, నిపుణులు భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు.

చైనాలోని షాంఘైలో 2026 సెప్టెంబర్ 23 నుంచి 26 వరకు వరల్డ్‌స్కిల్స్ షాంఘై-2026 పోటీలు నిర్వహించారు. ఇందులో సుమారు 68 దేశాలు, ప్రాంతాల నుంచి 64 నైపుణ్య విభాగాల్లో 1,400 మందికి పైగా యువ పోటీదారులు పాల్గొన్నారు. భారత్ తొలిసారి 63 నైపుణ్య విభాగాల్లో ఇప్పటి వరకు లేనంతగా 70 మంది పోటీదారులతో పాల్గొని భారత్ 6 రజత పతకాలు, 20 అత్యుత్తమ ప్రతిభ (ప్రావీణ్యం) పతకాలతో 10వ స్థానాన్ని కైవసం చేసుకుంది.

ఈ పోటీల్లో ఎన్ఐఎఫ్‌టీ ఫ్యాషన్ సాంకేతికత, విజువల్ మర్కండైజింగ్, రిటైల్ అమ్మకాలు, డిజిటల్ ఇంటరాక్టివ్ మీడియా డిజైన్ వంటి నాలుగు నైపుణ్య విభాగాలకు ప్రాతినిధ్యం వహించింది. సృజనాత్మక, డిజిటల్, రిటైల్ ఆధారిత నైపుణ్య విభాగాల్లో ఫ్యాషన్ విద్యకు పెరుగుతున్న ప్రాధాన్యతను ఈ భాగస్వామ్యం ప్రతిబింబించింది. ఎన్ఐఎఫ్‌టీ విద్యార్థులు మూడు నైపుణ్య విభాగాల్లో 2 రజత పతకాలు, ఒక ప్రావీణ్య పతకం సాధించడంతో ఈ విజయంలో ఎన్ఐఎఫ్‌టీ భాగస్వామ్యం గణనీయంగా దోహదపడింది.

వరల్డ్‌స్కిల్స్ పోటీల్లో ఫ్యాషన్ టెక్నాలజీ విభాగంలో ఎన్ఐఎఫ్‌టీకి సుదీర్ఘ భాగస్వామ్యం ఉంది. 2011 నుంచి ఈ నైపుణ్య విభాగంలో ఎన్ఐఎఫ్‌టీ పాల్గొంటోంది. షాంఘై-2026లో ఎన్ఐఎఫ్‌టీ గాంధీనగర్ నుంచి ఫ్యాషన్ డిజైన్‌లో పట్టభద్రురాలైన శ్రీమతి విధి నీరవ్‌కుమార్ సుతార్ ఫ్యాషన్ టెక్నాలజీ విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి, ప్రావీణ్య పతకాన్ని అందుకున్నారు.

భారతీయ నిపుణురాలు, ప్రొఫెసర్ (డాక్టర్) మోనికా గుప్తా, ఎన్ఐఎఫ్‌టీ శిక్షణ బృందం మార్గదర్శకత్వంలో విధికి ఎన్ఐఎఫ్‌టీ న్యూఢిల్లీలో నాలుగు నెలలపాటు ప్రత్యేకంగా శిక్షణను అందించారు. ఫ్యాషన్ డిజైన్, వరల్డ్‌స్కిల్స్ పోటీల్లో విస్తృత అనుభవం ఉన్న ప్రొఫెసర్ గుప్తా, శిక్షణ కాలమంతా విధికి ప్రత్యేక శిక్షణ, మార్గదర్శకత్వాన్ని అందించారు. సాంకేతిక నైపుణ్యం, కచ్చితత్వం, అంతర్జాతీయ ప్రమాణాల పాటింపు, వరల్డ్‌స్కిల్స్ పోటీల పరిస్థితుల్లో సమర్థవంతంగా పనిచేసే సామర్థ్యాన్ని పెంపొందించడంపై ఈ శిక్షణలో ప్రధానంగా దృష్టి సారించారు.

డిజిటల్ ఇంటరాక్టివ్ మీడియా డిజైన్ విభాగంలో ఎన్ఐఎఫ్‌టీ ముంబయికి చెందిన కోవిద్ అజయ్ గాంగ్రడే రజత పతకం సాధించారు. రిటైల్ అమ్మకాల విభాగంలో ఎన్ఐఎఫ్‌టీ పంచకులాకు చెందిన సానియా జోషి రజత పతకం గెలుచుకున్నారు. వరల్డ్‌స్కిల్స్ షాంఘై-2026లో కొత్తగా అభివృద్ధి చెందుతున్న నైపుణ్య విభాగాల్లో రిటైల్ అమ్మకాలు, డిజిటల్ ఇంటరాక్టివ్ మీడియా డిజైన్ కూడా ఉండటంతో వీరి విజయాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఫ్యాషన్, సృజనాత్మక పరిశ్రమల్లో వస్తున్న మార్పులు, సాంకేతికత, డిజిటల్ వేదికలు, వినియోగదారుల అనుభవం ఈ రంగంతో మరింతగా అనుసంధానమవుతున్న తీరును ఈ విభాగాలు ప్రతిబింబిస్తున్నాయి.

ఎన్ఐఎఫ్‌టీ భాగస్వామ్యం విజువల్ మెర్చండైజింగ్ విభాగానికీ విస్తరించింది. ఈ నైపుణ్య విభాగంలో ఎన్ఐఎఫ్‌టీ బెంగళూరుకు చెందిన అనూజ అజయ్ వారే భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు.

ఎన్ఐఎఫ్‌టీ దృష్టిలో వరల్డ్‌స్కిల్స్ ప్రయాణం కేవలం అంతర్జాతీయ పోటీలో పాల్గొనడం మాత్రమే కాదు. దీని ద్వారా విద్యార్థులకు ప్రపంచ స్థాయి వృత్తిపరమైన ప్రమాణాలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, అంతర్జాతీయ ప్రమాణాలు, పరిశ్రమ అంచనాలపై పూర్తి అవగాహన లభిస్తుంది. ఈ అనుభవం ద్వారా ఎన్ఐఎఫ్‌టీ తన శిక్షణ పద్ధతులను నిరంతరం మెరుగుపరుచుకోవడంతో పాటు, ప్రపంచవ్యాప్తంగా అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలను తమ విద్యా, నైపుణ్యాభివృద్ధి వ్యవస్థలో చేర్చుకునే అవకాశం లభిస్తుంది.

వరల్డ్‌స్కిల్స్ షాంఘై-2026లో ఎన్ఐఎఫ్‌టీ విద్యార్థులు సాధించిన విజయాలు.. ఫ్యాషన్, సాంకేతికత, సృజనాత్మకత, రిటైల్, డిజిటల్ నైపుణ్యాలను సమన్వయం చేస్తూ, అత్యున్నత అంతర్జాతీయ స్థాయిలో పోటీపడగల నిపుణులను తయారు చేయడంలో సంస్థకు ఉన్న నిరంతర నిబద్ధతను ప్రతిబింబిస్తున్నాయి.

వరల్డ్‌స్కిల్స్ షాంఘై-2026లో పాల్గొన్న విద్యార్థులు, నిపుణులు, శిక్షకులు, అధికారులు, జౌళి మంత్రిత్వ శాఖతో పాటు వారి శిక్షణ, సన్నద్ధత, భాగస్వామ్యంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ఎన్ఐఎఫ్‌టీ అభినందనలు తెలిపింది.

# డబుల్ ఇళ్ల కోసం అర్ధరాత్రి వరకు ఎదురుచూపులు

### కుటుంబాలతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట పడిగాపులు

నిజామాబాద్, అక్టోబర్ 1:సొంతింటి కల నెరవేరుతుందన్నఆశతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులు బుధవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట గంటల తరబడి పడిగాపులు కాశారు. రాత్రి 12.40 గంటల వరకు కార్యాలయం వద్దే వేచి చూసినా స్పష్టత లేకపోవడంతో పలువురు నిరాశకు గురైనట్లు తెలిపారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగానే జాప్యం జరుగుతోందని పలువురు ఆరోపించారు. లబ్ధిదారులు తమకు ఇళ్లు ఎప్పుడు కేటాయిస్తారోనని ఎదురు చూస్తూ కార్యాలయం వద్దే ఉన్నారు. ఇదిలా ఉండగా, రాత్రి 11.55 గంటల సమయంలో ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని లబ్ధిదారుల జాబితాపై అధికారులతో సమీక్షించినట్లు సమాచారం. జాబితాలో ఇంకా కొన్ని అవకతవకలు ఉన్నాయన్న అభిప్రాయంతో, మరోసారి పరిశీలించి కొత్త జాబితాను సిద్ధం చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిసింది. గంటల తరబడి నిరీక్షించినప్పటికీ ఇళ్ల కేటాయింపుపై స్పష్టత రాకపోవడంతో పలువురు లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పేదల సొంతింటి కలను దృష్టిలో ఉంచుకుని జాబితా ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, అర్హులైన వారికి ఇళ్లను కేటాయించాలని వారు కోరుతున్నారు.

# మాజీ మంత్రి ఎల్లారెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి

### 87వ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 1: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత మాజీ మంత్రి ఎల్కోటి ఎల్లారెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని ఊట్కూర్ సింగిల్ విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూర్యప్రకాశ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అరవింద్‌కుమార్, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యజ్ఞేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మాజీ మంత్రి ఎల్లారెడ్డి 87వ జయంతిని పురస్కరించుకుని గురువారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. ఎల్లారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి, పండ్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల అభివృద్ధికి ఎల్లారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మంత్రిగా పనిచేసిన సమయంలో ఈ ప్రాంత ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేశారని గుర్తుచేశారు. ప్రజల సంక్షేమం, ప్రాంత అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా చేసుకుని రాజకీయ జీవితాన్ని కొనసాగించారని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్న ఎల్లారెడ్డి పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడ్డారని కొనియాడారు. ప్రజాసేవకు చివరి శ్వాస వరకు అంకితమైన ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కుమారులు ఎల్కోటి జనార్దన్‌రెడ్డి, నారాయణరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డితో పాటు నాయకులు గోపాల్‌రెడ్డి, రాజశేఖర్, శివరామరాజు, జనార్దన్‌రెడ్డి, లక్ష్మణ్, జగదీష్‌గౌడ్, వాజిద్‌పాషా, వెంకటేష్, అశోక్, కల్వాల్ సమీ, అనంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు 10 మంది ఎంపిక



నిజామాబాద్, అక్టోబర్ 1: నిజామాబాద్ నగరంలోని నవ్య భారతి గ్లోబల్ స్కూల్‌లో జిల్లాస్థాయి అండర్-17 బాలబాలికల టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు బాలికల విభాగంలో 25 మంది, బాలుర విభాగంలో 40 మంది క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు.

జిల్లాస్థాయి ఎంపిక పోటీలను పీడీలు నాంచారి శ్రీనివాస్, అబ్బయ్య, నగేష్, ఇందిర, శ్యామల నిర్వహించారు. పోటీల అనంతరం అండర్-17 బాలుర విభాగం నుంచి ఐదుగురు, బాలికల విభాగం నుంచి ఐదుగురు క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ అలివేణి మంగ తెలిపారు.

త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ప్రతిభ కనబరిచి నిజామాబాద్ జిల్లాకు పేరు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నవ్య భారతి గ్లోబల్ స్కూల్ చైర్మన్ సంతోష్ కుమార్, కరస్పాండెంట్ శ్రీదేవి, హెచ్‌ఆర్ డైరెక్టర్ లత, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ అలివేణి మంగ తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటకంలో ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేసేందుకు భారత్, ఇటలీ ఆమోదం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 1:ఇండియా-ఇటలీ జాయింట్ వర్కింగ్ గ్రూప్ (జేడబ్ల్యూజీ) రెండో సమావేశం 2026 సెప్టెంబర్ 29న జరిగింది. ఈ సమావేశానికి భారత పర్యాటక మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ భువనేష్ కుమార్, ఇటలీ పర్యాటక మంత్రిత్వశాఖ సెక్రటరీ జనరల్ మిస్ ఎమ్మాన్యుయేలా ట్రిపి సహ అధ్యక్షత వహించారు.

భారత్ పక్షాన పర్యాటక మంత్రిత్వ శాఖ, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, రోమ్‌లో భారత్ ఎంబసీ, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ (ఐఏటీవో) ప్రతినిధులు పాల్గొన్నారు. ఇటలీ ప్రతినిధి బృందంలో పర్యాటక మంత్రిత్వ శాఖ, విదేశీ వ్యవహారాలు, అంతర్జాతీయ సహకార మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీలోని ఇటలీ ఎంబసీ, ఈఎన్ఐటీ (ఇటాలియన్ నేషనల్ టూరిజం బోర్డు)కు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రెండు దేశాల మధ్య పర్యాటక సహకారాన్ని బలోపేతం చేసేందుకు విస్తృత అవకాశం ఉన్న రంగాలపై చర్చల్లో దృష్టి సారించారు. వాటిలో టూరిజం డేటాను పంచుకోవడం, అంతగా ప్రాచుర్యం పొందని పర్యాటక ప్రాంతాలను వెలుగులోకి తీసుకురావడం, సినీ పర్యాటకం, డెస్టినేషన్ ట్విన్నింగ్, నైపుణ్యాలు, సామర్థ్య నిర్మాణం, సంస్థల మధ్య (బీ2బీ) భాగస్వామ్యాన్ని విస్తరించడం తదితరమైనవి ఉన్నాయి.

గుర్తించిన రంగాల్లో సహకారాన్ని ముందుకు తీసుకెళ్లడానికి, సంబంధిత వర్గాల మధ్య నిరంతర సంప్రదింపులను సులభతరం చేయడానికి ప్రత్యేక సాంకేతిక బృందాలను, సంప్రదింపుల కేంద్రాలను ఏర్పాటు చేయడానికి రెండు దేశాలూ ఈ సమావేశంలో అంగీకరించాయి.

పర్యాటక రంగంలో సహకారానికి ఉన్న అవకాశాలపై ఉభయ పక్షాలు చర్చించాయి. భారత్-ఇటలీ సాంస్కృతిక, పర్యాటక సంవత్సరంగా 2027ను నిర్వహించాలన్న ప్రతిపాదన నేపథ్యంలో రెండు దేశాల మధ్య సాంస్కృతిక, పర్యాటక వినిమయాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ చర్చలు జరిగాయి.

పర్యాటకంలో ద్వైపాక్షిక సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవడానికి, రెండు దేశాల మధ్య బలమైన సంస్థాగత, పారిశ్రామిక సంబంధాలను ఏర్పాటు చేసుకోవడానికి భారత్, ఇటలీ కట్టుబడి ఉన్నాయని జాయింట్ వర్కింగ్ గ్రూప్ రెండో సమావేశం పునరుద్ఘాటించింది.

# రక్తదానం సామాజిక బాధ్యత..

### ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు ముందుకు రావాలి: కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



మహబూబ్‌నగర్, అక్టోబర్ 1: రక్తదానం సామాజిక బాధ్యత అని, ప్రాణాలను కాపాడే ఈ మహాదానానికి మించిన దానం మరొకటి లేదని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనం చేసే రక్తదానం ఆపదలో ఉన్న ఒకరి ప్రాణాలను కాపాడేందుకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు.

యువత, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో రక్తదాన శిబిరాల్లో పాల్గొని స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ కోరారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడం సాధ్యం కాదని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి సకాలంలో అందించేందుకు తగినంత రక్త నిల్వలు అందుబాటులో ఉండటం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యానికి ఎలాంటి హాని ఉండదని, వైద్యుల సూచనలు, నిర్దేశిత ఆరోగ్య ప్రమాణాలకు అనుగుణంగా అర్హులైన వారు రక్తదానం చేయవచ్చని తెలిపారు. ఒక్కసారి రక్తదానం చేయడం ద్వారా ముగ్గురి ప్రాణాలను కాపాడే అవకాశం ఉందనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ రఫిక్, డాక్టర్ రోహిత్, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది, అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాత కిరణ్‌కు ఆత్మీయ సత్కారం..

మహబూబ్‌నగర్, అక్టోబర్ 1: అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి మానవతా దృక్పథంతో పలుమార్లు రక్తదానం చేసిన ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు చెందిన బీజేపీ యువ నాయకుడు బొడ్డు కిరణ్‌ను వివిధ పార్టీల నాయకులు అభినందించారు. జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా గురువారం ఆయనను ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఎంతోమంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. 'మానవసేవే మాధవసేవ' అనే దృక్పథంతో బొడ్డు కిరణ్ మాదిరిగా యువత ముందుకు వచ్చి రక్తదానం, సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు.

# ప్రతిభా శాలియైన ఆర్థిక వేత్త సి.డి.దేశ్‌ముఖ్

## అక్టోబర్ 2... తొలి రిజర్వు బ్యాంకు గవర్నర్ సి.డి.దేశ్‌ముఖ్ వర్ధంతి



(సి. పి.1982) పూర్తి పేరు చింతమన్ ద్వారకానాథ్ దేశ్‌ముఖ్

స్వతంత్ర భారత దేశపు తొలి రిజర్వ్ గవర్నర్‌గా నియమితులైన తొలి భారతీయుడిగా సిడి దేశ్‌ముఖ్‌ను ఎప్పటికీ గుర్తుంచు కుంటారు. భారతీయ నాటి కరెన్సీపై సిడి దేశ్ ముఖ్ సంతకాన్ని చూడవచ్చు.

భారతీయ రిజర్వ్ బాంక్ మూడవ గవర్నర్, 1943, ఆగష్టు 11 నుంచి 1949, జూన్ 30 వరకు ఈ పదవిని నిర్వహించారు. ఆ తర్వాత దేశ్‌మఖ్ భారత దేశానికి ఆర్థిక మంత్రిగా నియమితులైనారు.

అంతర్జాతీయ ద్రవ్యనిధిలో సంవత్సరానికి 30వేల డాలర్ల వేతనం కాదని దేశసేవకే తన జీవితాన్ని ఆయన అంకితం చేసిన గొప్ప సామాజిక సేవకుడు. ప్లానింగ్ కమిటీ సభ్యుడుగా ఉంటూనే ఆర్థికమంత్రిగా ఉన్నా ప్రతిభాశాలి. బొంబాయి నగరాన్ని కేంద్రం అధీనంలో ఉంచడం ఇష్టపడక దేశ్‌ముఖ్ మంత్రి పదవికి రాజీనామా చేసిన నిబద్ధత కలిగిన రాజకీయ నాయకులు.

భారత ఆర్థికమంత్రులలో సి.డి. దేశ్‌ముఖ్ అత్యంత ప్రతిభావంతుడు. ఆయన హయాంలో దేశంలో విదేశీ మారక కొరతలేదు. లోటు బడ్జెటు ప్రస్తావన రాలేదు. ద్రవ్యోల్బణం రేటు వెర్రితలలు వేయలేదు. అంతర్జాతీయ మార్కెట్‌లో మన రూపాయి విలువ తగ్గలేదు.

ఇండియన్ సివిల్ సర్వీస్ సభ్యుడైన దేశ్‌ముఖ్ కు 1939 నుంచే రిజర్వ్ బ్యాంక్తో సంబంధం ఉంది. 1941లో రిజర్వ్ బ్యాంక్ డిప్యూటి గవర్నర్ గా నియమించ బడ్డారు. 1943లో. ఆ తర్వాత జేమ్స్ టేలర్ నుంచి 3 వ గవర్నర్ గా బాధ్యతలు తీసుకున్నారు. దేశ్‌ముఖ్ గవర్నర్ గా ఉన్న సమయంలో ప్రపంచంలో ముఖ్యమైన ఆర్థిక పరిణామాలు సంభవించాయి.

1943లో రిజర్వు బ్యాంకు గవర్నర్ టెయిలర్ మరణించగా, డిప్యూటీ గవర్నరుగా ఉన్న సి.డి. దేశ్‌ముఖ్‌ని ఏకగ్రీవంగా గవర్నరుగా ఎన్నుకున్నారు. రిజర్వు బ్యాంక్ గవర్నరుగా దేశ్‌ముఖ్ దేశానికి ఎంతో సేవ చేశారు.

జూలై 1944లో జరిగిన బ్రెట్టన్ వుడ్స్ సమావేశంలో అతడు కూడా భారత దేశం తరఫునన పాల్గొన్నారు. ఈ సమావేశమే అంతర్జాతీయ ద్రవ్య సంస్థ (ఎ.ఓ.ఈ), ప్రపంచ బ్యాంకు (శ్రీ.ఎః.ఖీ.ఆ) ఏర్పడడానికి కారణమైంది. ఈ రెండు సంస్థల లోనూ దేశ్‌ముఖ్ బోర్డ్ ఆఫ్ గవర్నర్ గా పదేళ్ళ పాటు పనిచేశారు. 1950లో పారిస్లో జరిగిన ఈ రెండు సంస్థల వార్షిక సంయుక్త సమావేశంలో ఇతడు చైర్మెన్ గా వ్యవహరించారు.

1945లో సిమ్లా సమావేశంలో వైస్రాయ్ సభ సభ్యులంతా భారతీయులే ఉండాలని తీర్మానించారు. ఆ జాబితాలో ఆర్థిక సభ్యుడుగా దేశ్‌ముఖ్ పేరు వేయాలని ప్రయత్నించారు. కానీ దేశ్‌ముఖ్ తనకు రాజకీయాలు పడవని తప్పించు కున్నారు. 1950లో ప్లానింగ్ కమిషన్ ఏర్పడింది. ఆ బాధ్యత దేశ్‌ముఖ్ మీద పడింది. అదే సంవత్సరం డా. జాన్ మత్తయ్ ఆర్థికమంత్రిగా రాజీనామా ఇచ్చినప్పుడు దేశ్‌ముఖ్ ఆ స్థానం పొందారు. ప్లానింగ్ కమిటీ సభ్యుడుగా ఉంటూనే ఆర్థికమంత్రిగా ఉన్నారు.

1953 జనవరి 22న దేశ్‌ముఖ్ వివాహం దుర్గాబాయి తో జరిగింది. అది దేశంలో గొప్ప సంచలనం సృష్టించింది. వారి పెళ్లిపత్రంపై నెహ్రూ, కృపలానీ దంపతులు సాక్షులుగా సంతకాలు చేశారు.

దుర్గాబాయ్‌తో వివాహం జరిగిన తర్వాత మొదటి జన్మదినాన్ని ఆయన తన ఇంట్లో చాలా నిరాడంబరంగా జరుపు కున్నారు. ఈ సంగతి నెహ్రూకు తెలిసి, తీరిక చేసుకొని నెహ్రూ వాళ్ల ఇంటికి వెళ్లారట. 'ఏం దుర్గాబాయ్! దేశ్‌ముఖ్ నీ భర్తే కావచ్చు.. నా క్యాబినెట్ మంత్రి సుమా!' అని చమత్కరించారట. ఆ దంపతులు ఇచ్చిన టీ బిస్కెట్ తీసుకుని నెహ్రూ మందహాసంతో వెళ్లిపోయారట. ఇలాంటి ఆప్యాయత ఈ రోజుల్లో కనిపించడం అరుదు. తన నియోజకవర్గం ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా బొంబాయి నగరాన్ని కేంద్రం అధీనంలో ఉంచడం ఇష్టపడక దేశ్‌ముఖ్ మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత ఆయన ఢిల్లీ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్‌గా ఆరేళ్లు చేశారు.

దేశ్‌ముఖ్ సేవలను అంతర్జాతీయ ద్రవ్యనిధి వినియోగించు కోవాలని కోరినప్పుడు అందుకు ఆయన అంగీకరించ లేదు. అప్పటికే దేశ్‌ముఖ్ దంపతులు సంక్షేమ కార్యక్రమాలను దేశమంతా విస్తరించి ఉన్నారు. సంవత్సరానికి 30వేల డాలర్ల వేతనం కాదని దేశసేవకే తన జీవితాన్ని ఆయన అంకితం చేశారు. ఇన్ని ఉద్యోగాలు చేసిన ఆయన ఎల్లప్పుడూ నిర్ధనుడే. కూడబెట్టిన ధనమంతా పూణేలో ఉన్న ఇల్లు మాత్రమే.

1952లో దేశ్‌ముఖ్ విద్యనభ్యసించిన కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయపు జేసస్ కళాశాల నుంచి గౌరవ ఫెలోగా ఎన్నికైనారు.

1959లో ప్రభుత్వ సర్వీసు రంగంలో రామన్ మెగ్సేసే అవార్డును పిలిప్పీన్స్ కు చెందిన జోస్ అగ్విలార్ తో కల్సి సంయుక్తంగా పొందారు.

1975లో భారత ప్రభుత్వం

పద్మ విభూషణ పురస్కారంతో సత్కరించగా, అదే సంవత్సరం ఆయన సతీమణి దుర్గాబాయి దేశ్‌ముఖ్ కూడా పద్మ విభూషణ్ పొందడం, భార్యా భర్తలు ఇద్దరూ ఒకే ఏడాది పురస్కార గ్రహీతలు కావడం విశేషం. 1982, అక్టోబరు 2న మరణించారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# పర్యావరణం ద్వారానే ప్రజాహితం

## తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ కత్తి.శ్రీనివాస్

### స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటిన బ్యాంకు సిబ్బంది




కరీంనగర్, అక్టోబర్ 1: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్, అక్టోబర్ 1పర్యావరణాన్ని కాపాడుకోవడం ద్వారానేప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండగలు గుతారని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ కత్తి శ్రీనివాస్ అన్నారు.మహాత్మా గాంధీ జయంతిని పురస్కరి ంచుకొని స్వచ్ఛత సేవ కార్యక్రమ ంలో భాగంగాబ్యాంకు మేనేజరు ్లు,సిబ్బందితో కలిసి గురువారం స్థానిక సప్తగిరి కాలనీ లోయర్ మానేరు డ్యాం వద్ద మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానాటికి పెరిగి పోతున్న కాలుష్యాన్ని నివారించే ందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావ రణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా గుర్తిం చాలని ఆయన కోరారు.గాలి, నీరు, నేల మరియు జీవవైవిధా ్యన్ని కాపాడుకోవడం మానవాళి మనుగడకు అత్యంత ముఖ్యమని అన్నారు.మనచుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉ ంచడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు.గ్రామీణ అభివృద్ధిలో టిజీబి పాత్ర.గ్రామీణ అభివృది ్ధలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ముఖ్య భూమిక పోషిస్తున్న దనిరీజనల్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. గ్రామీణ ప్రజలు ముఖ్యంగా రైతులకు గ్రామీణ బ్యాంక్ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కరీంనగర్ రీజియన్ పరిధిలో 59 శాఖల ద్వారా బ్యాంక్ కార్యకలాపాలు కొనసాగు తున్నాయని తెలిపారు. డిపాజిట్ల సేకరణ,రుణాల మంజూరులో తమ బ్యాంక్ పారదర్శకంగా పనిచేస్తుందని చెప్పారు.బ్యాంక్ సేవలను ప్రజలు వినియో గించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బ్యాంక్ సీనియర్ మేన ేజర్(ఆపరేషన్స్) కందుల సుబ్బా రావు, సీనియర్ మేనేజర్ బిజినెస్ కే వంశీకృష్ణ,నోడల్ ఆఫీసర్ జి మౌనిక, చీఫ్ మేనేజర్ జలంధర్ రెడ్డి, రమణారెడ్డి, మేనేజర్లు కొండపలకల వేణుమాధవ్,ఎం ప్రవీణ్ రెడ్డి వివిధ బ్యాంక్ శాఖల మేనేజర్లు, రీజినల్ మేనేజర్ కార్యాలయ సిబ్బందిపాల్గొన్నారు.

# యూపీ రైతుల నుంచి రూ.3,992.57 కోట్ల

## విలువైన ధాన్యం కొనుగోళ్లకు ఆమోదం

న్యూఢిల్లీ, అక్టోబర్ 1:ఉ త్తరప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల రైతుల నుంచి 2026-27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ కోసం ధరల మద్దతు పథకం (పీఎస్ఎస్) కింద కనీస మద్దతు ధరతో రూ.5,547.99 కోట్ల విలువైన పంట ఉత్పత్తుల కొనుగోళ్లకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఆమోదం తెలిపారు. మార్కెట్ ధరల పతనం నుంచి రైతులను రక్షించడం, ముఖ్యంగా పప్పుధాన్యాలు, నూనెగింజల రైతుల ఉత్పత్తులకు లాభదా యకమైన రాబడిని అందించడం ఈ నిర్ణయం ముఖ్య ఉద్దేశం.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో రైతుల సంక్షేమం, వారి ఆదాయాలను పెంచడం, వ్యవసాయంలో స్వయం-సమృద్ధిని బలోపేతం చేయడం ప్రభుత్వ కీలక ప్రాధాన్యాలుగా ఉన్నాయని శ్రీ చౌహాన్ అన్నారు.

రైతులు తమ ఉత్పత్తులకు లాభదాయకమైన ధరలు పొందేలా, కొనుగోలు యంత్రాంగాలను మరింత పారదర్శకంగా, మరింత అందు బాటులో ఉంచేలా ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన తెలిపా ారు. ఆమోదించిన కొనుగోలు ప్రణాళిక ప్రకారం... కనీస మద్దతు ధరతో కీలకమైన పప్పుధాన్యాలు, నూనెగింజల భారీస్థాయి కొనుగోలు ద్వారా మూడు రాష్ట్రాల్లోని రైతులు లబ్ధి పొందుతారు.

ఆమోదించిన కొనుగోళ్లలో అతిపెద్ద వాటాగా, ఉత్తరప్రదేశ్ రైతుల నుంచి రూ.3,992.57 కోట్ల విలువైన కొనుగోళ్లకు మంజూరు లభించింది. కనీస మద్దతు ధరతో రూ.3,937.70 కోట్ల విలువైన 4,66,000 మెట్రిక్ టన్నుల కందిపప్పు, రూ.54.87 కోట్ల విలువైన 6,250 మెట్రిక్ టన్నుల పెసరపప్పు కొనుగోళ్లు ఇందులో భాగంగా ఉన్నాయి.

# ఆర్టీసీ విలీనమే లక్ష్యం.. టీజేఎంయూ గెలుపే ధ్యేయం

## కార్మికుల సమావేశంలో నిర్మలా జగ్గారెడ్డి పిలుపు



సంగారెడ్డి, అక్టోబర్ 1: (నేటినిజం ప్రతినిధి):ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలంటే అది కాంగ్రెస్‌తో సాధ్యమ వుతుందని డీసీసీ అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి పిలుపునిచ్చారు. కార్మిక సంఘాల ఎన్నికల్లో తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ (టీజేఎంయూ) అభ్యర్థుల విజయానికి కార్మికులు, నాయకులు సమన్వయంతో కృషి చేయాలని ఆమె కోరారు.

గురువారం మధ్యాహ్నం సంగారెడ్డిలో ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా రీజియన్ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగి ంచారు. అక్టోబర్ 9న జరగనున్న యూనియన్ ఎన్నికల్లో గద గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో విజయం సాధించాలని కార్మికు లను కోరారు. కొత్త బస్టాండ్ ఎదురుగా బుధవారం టీజేఎం యూ కార్యాలయాన్ని ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు తోపాజీ అనంత కిషన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతరం కొత్త బస్టాండ్ నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నిర్మలాజగ్గారెడ్డి మాట్లాడుతూ గతం ప్రభుత్వంలో యూనియన్లు లేకుండా చేశారని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరి ంచే నాయకులను ఎన్నుకోవాలని ఆమె ఆర్టీసీ కార్మికులకు సూచిం చారు. మా వంతు సహకారం పూర్తిస్థాయిలో ఉంటుందని, గెలు పే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. టీజేఎంయూ గౌరవ అధ్యక్షుడు తోపాజి అనంత కిషన్ మాట్లాడుతూ గెలుపు కోసం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సహకారం పూర్తిస్థా యిలో ఉంటుందని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ భయపడ కుండా మీ యొక్క ఓటును వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో టీజేఎంయూ రాష్ట్ర కార్యదర్శి హనుమంతు ముదిరా జ్, రాష్ట్ర అధ్యక్షుడు బీవీకే రావు, మున్సిపల్ చైర్మన్లు వనిత సంతోష్, మునిపల్లి సత్యనారా యణ, వైస్ చైర్మన్ షఫీ, కాంగ్రెస్ సీనియర్ నేత పి.రఘుగౌడ్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంగేరి శ్రీహరి, ఆర్టీసీ ఉ ద్యోగులు పాల్గొన్నారు.

# వేగంగా వృద్ధి చెందుతున్న సేవారంగాల్లో ఒకటిగా ఆయుష్ ఆవిర్భావం: 36.92 బిలియన్

## అమెరికన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని ఆర్ఐఎస్ అధ్యయనం అంచనా

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 1:అభి వృద్ధి చెందుతున్న దేశాల కోసం పరిశోధన సమాచార వ్యవస్థ (ఆర్ఐఎస్) చేపట్టిన తాజా అధ్య యనం ప్రకారం భారత్‌లో అత్య ంత వేగంగా అభివృద్ధి చెందు తున్న సేవారంగాల్లో ఒకటిగా ఆయుష్ ఆవిర్భవించింది. ఆర్థిక సంవత్సరం 2024-25లో దీని ఆర్థిక పరిమాణం 36.92 బిలియన్ డాలర్లుగా అంచనా వేసింది. ఆర్థిక సంవత్సరం 2022-23 నుంచి 16.91 శాతం సీఏజీఆర్‌ను ఈ రంగం నమోదు చేసింది. ఆరోగ్యసేవలు, ఆరోగ్య సంరక్షణ, ఉపాధి కల్పన, వైద్య విలువ ఆధారిత పర్యాటకం ద్వారా భారతదేశ ఆర్థికాభి వృద్ధిలో ఈ రంగం వాటా పెరుగుతోంది. 2047 నాటికి ఆయుష్ సేవల ఆర్థికవ్యవస్థ 216 బిలియన్ అమెరికన్ డాలర్ల నుంచి 318 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరుకుంటుందని ఈ అధ్యయనం అంచనా వేసింది. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనకు దోహదపడటంలో ఈ రంగానికున్న అపారమైన సామర్థ్యాన్ని ఇది తెలియజేస్తోంది. సెప్టెంబర్ 23న నాగపూర్‌లో జరిగిన 11వ ఆయుర్వేద దినోత్సవాల్లో ఈ నివేదికను అధికారికంగా విడుదల చేశారు.

ఆయుష్ రంగానికి ఉన్న ఆర్థిక సామర్థ్యాన్ని గుర్తించడంలో ఈ అధ్యయన ఫలితాలు ముఖ్య మైన మైలురాయిని సూచిస్తున్నా యని కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా), ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రతాప్ రావ్ జాదవ్ అన్నారు. "ఆయుష్ కేవలం సాంస్కృతిక వారసత్వం మాత్రమే కాదని, భారతదేశ ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమైన వృద్ధి చోదకమని ఈ అధ్యయనం ఫలితాలు తెలియ జేస్తున్నాయి. ఆరోగ్యసేవలు, ఆరోగ్య సంరక్షణ, ఉపాధి కల్పన, ప్రపంచ ఆర్థిక భాగస్వామ్యంలో ఆయుష్ రంగం ముఖ్యమైన పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉంది. అదే సమయంలో ఆరోగ్యకర మైన, ఆత్మనిర్భర భారత్ అనే మన లక్ష్యానికి తోడ్పాటునందిస్తోంది" అని మంత్రి అన్నారు.

"అన్ని ప్రధాన ఆయుష్ వ్యవ స్థల్లోనూ... సంస్థాగత ప్రాతిప దికన దేశవ్యాప్తంగా చేపట్టిన సర్వే ద్వారా ఆయుష్ సేవల రంగం అందిస్తున్న ఆర్థిక సహకారాన్ని తొలిసారి లెక్కించారు" అని ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యద ర్శి వైద్య రాజేష్ కొటేచా తెలి పారు. భవిష్యత్ పెట్టుబడులు, విధాన ప్రణాళిక, సంస్కరణలకు మార్గనిర్దేశం చేసే బలమైన ఆధారంగా ఈ నివేదిక నిలుస్తు ందని ఆయన అభిప్రాయపడ్డారు.

"భారతదేశ ఆయుష్ సేవల ఆర్థిక వ్యవస్థపై సాక్ష్యం ఆధారిత అవగాహనను అందించడంలో ఈ అధ్యయనం కీలకంగా నిలు స్తుంది. మొత్తం ఆరు ఆయుష్ వ్యవస్థల్లో ఉన్న 15,914 సంస్థ లపై జాతీయ స్థాయిలో నిర్వహించిన సర్వే ఆధారంగా చేపట్టిన ఈ అధ్యయనం ఫలితా లు... ఈ ఆర్థిక వ్యవస్థ విలువ 36.92 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరుకుందని తెలియ జేస్తున్నాయి. అలాగే ప్రతి ఏటా దాదాపు 17 శాతం వృద్ధిని సాధి స్తూ, 1.76 మిలియన్ల మందికి జీవనోపాధిని కల్పిస్తోందని తెలియజేస్తున్నాయి. అలాగే ఈ రంగం ఇకపై అప్రాధాన్య రంగం కాదు. అభివృద్ధి చెందుతున్న, జ్ఞానాధారిత ఆర్థిక వ్యవస్థ" అని ఆర్ఐఎస్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ సచిన్ కుమార్ శర్మ తెలియజేశారు.

ఆర్థిక సంవత్సరం 25లో ఆయుష్ సేవల ఆర్థిక వ్యవస్థ విలువ 36.92 బిలియన్ అమెరికన్ డాలర్లుగా ఈ అధ్య యనం అంచనా వేసింది. ఆర్థిక సంవత్సరం 23 నుంచి సమగ్ర వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్) 16.91 శాతం నమోదు చేసింది. వ్యవస్థీకృత ఆరోగ్య సేవల పంపిణీ, ఆరోగ్య సంరక్షణ సేవలు, నాణ్యమైన మౌలికవ సతులు, అంతర్జాతీయ ప్రచారం ద్వారా మరింత విస్తరించేందుకు గణనీయ అవకాశం ఉన్న, భారతీయ సేవా ఆర్థికరంగంలో వేగంగా వృద్ధి చెందుతున్న విభా గంగా ఆయుష్ సేవలు ఆవిర్భవి ంచాయని ఈ ఫలితాలు తెలియజేస్తున్నాయి.

ఆయుష్ సేవల ఆర్థికం రంగంలో క్లినిక్‌లు, డేకేర్ సెంటర్లు ప్రధాన భాగంగా ఉన్నాయని ఈ అధ్యయనం తెలియజేస్తోంది. ఈ రెండింటికీ ఈ రంగం మొత్తం ఆదాయంలో 71 శాతానికి పైగా వాటా ఉంది. క్లినిక్‌ల నుంచి 16.21 బిలియన్ అమెరికన్ డాలర్లు, డేకేర్ సెంటర్ల నుంచి 10.13 బిలియన్ అమెరికన్ డాలర్ల ఆదాయం వచ్చింది. ఈ రంగంలో అత్యంత ఎక్కువ ఆదాయం ఆర్జించిన విభాగంగా ఆయుర్వేదం నిలిచింది. ఈ రంగం మొత్తం ఆదాయంలో 17.73 బిలియన్ అమెరికన్ డాలర్లు లేదా సుమారుగా 48 శాతం వాటాను ఆయుర్వేద విభాగం నమోదు చేసింది.

ఆయుష్ ఆధారిత సేవలను అందించే యోగా సెంటర్లు, స్పాలు, రిసార్టులతో సహా ఆయుష్ వెల్‌నెస్ విభాగానికి గణనీయ స్థాయిలో పెరుగుతున్న ఆర్థిక భాగస్వామ్యాన్ని కూడా ఈ నివేదిక తెలియజేస్తోంది. ఈ విభాగం 21.29 శాతం సీఏజీ ఆర్‌ను నమోదు చేసింది. గడచిన రెండేళ్లలో ఆదాయంలో సుమారు 75 శాతం వృద్ధిని యోగా కేంద్రాలు నమోదు చేశాయి. ఇది నివారణ ఆరోగ్యం, ఆరోగ్య సం రక్షణ, సమగ్ర సంరక్షణ సేవలకు పెరుగుతున్న డిమాండును ప్రతిబింబిస్తోంది.

ఆయుష్ సేవల రంగం ముఖ్యమైన ఉపాధి వనరుగా ఆవిర్భవించిందని ఈ అధ్యయ నంలో తేలింది. ఈ రంగం 1.76 మిలియన్ల మందికి ప్రత్యక్ష జీవనోపాధికి తోడ్పాటును అందిస్తోంది. వీటిలో ఒక మిలి యన్‌కు పైగా ఉద్యోగాలు స్థానిక, ప్రత్యేక క్లినిక్‌ల్లోనే కేంద్రీకృతమై ఉన్నాయి. ఆయుష్ సేవల సిబ్బందిలో 43 శాతం మహిళలే ఉన్నారు. అనేక వ్యవస్థీకృత విభాగాల్లో మహిళల భాగస్వా మ్యం 50 శాతానికి పైగా ఉంది. ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో (స్పాలు, రిసార్టులు) 60 శాతానికి పైగా, విద్యా సంస్థల్లో 58 శాతం, డేకేర్ సెంటర్లలో 57 శాతం, ఆసుపత్రుల్లో 53 శాతం మంది మహిళలు పనిచేస్తున్నారు.

వైద్య విలువ ఆధారిత పర్యాటకం(ఎంవీటీ)లో పెరుగు తున్న ఆయుష్ సామర్థ్యాన్ని ఈ అధ్యయనం తెలియజేస్తోంది. ఆర్థిక సంవత్సరం 25లో 1.77 బిలియన్ అమెరికన్ డాలర్ల ఎంవీటీ ఆదాయాన్ని ఈ రంగం నమోదు చేసింది. మొత్తం రోగుల సంఖ్యలో విదేశీయుల సంఖ్య సుమారుగా 5 శాతం మాత్రమే ఉన్నప్పటికీ వీరి వాటా ఆసుప త్రుల ఆదాయంలో 15 నుంచి 25 శాతంగా ఉంది. పంచకర్మ, రెసిడెన్షియల్ యోగాతో సహా ఆయుష్ అందిస్తున్న చికిత్సా కార్యక్రమాల్లో రోగులు ఎక్కువ కాలం బస చేస్తున్నారని అధ్యయ నం గుర్తించింది. ఈ సగటు కాలం 5 నుంచి 11రోజులుగా ఉందని పేర్కొంది.

అంతర్జాతీయంగా రోగులను ఆకర్షించడంలో డిజిటల్ ప్రచా రం, నాణ్యత గుర్తింపు కీలకంగా మారాయి. అధ్యయనం ప్రకారం, ప్రత్యేకంగా వెబ్‌సైట్ నిర్వహిస్తున్న సంస్థలు 3.6 రెట్లు ఎక్కువగా విదేశీ రోగులను ఆకర్షించే అవ కాశా లున్నాయి. అలాగే ఎన్ఏబీ- వాచ్, ఐఎస్‌వో లాంటి గుర్తింపు పొం దిన నాణ్యతా ధ్రువీకరణ ఉంటే ఈ అవకాశాలు రెట్టింపు అవుతా యని అధ్యయనం తెలియ జేస్తోంది.

వికసిత్ భారత్-2047 లక్ష్యం దిశగా దేశం ముందడుగు వేస్తున్న తరుణంలో ఈ రంగం గణనీయమైన వృద్ధిని సాధించే అవకాశం ఉందని అధ్యయనం అంచనా వేసింది.

మౌలికవ సతులను, నాణ్యతా వ్యవస్థలను, నైపుణ్యాలను, డిజిటల్ సామర్థ్య లను, అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలను బలోపేతం చేయడ ంపై ఆధారపడి 2024-25 ఆర్థిక సంవత్సరంలో 36.92 బిలియన్ డాలర్లుగా ఉన్న ఆయుష్ సేవల ఆర్థిక వ్యవస్థ 2047 నాటికి 216 బిలియన్ అమెరికన్ డాలర్ల నుంచి 318 బిలియన్ అమెరికన్ డాలర్లకు విస్తరించే అవకాశం ఉంది.

ఆయుష్ విజ్ఞాన వ్యవస్థ, వ్యాపార సంస్థలు-వ్యవస్థాగత సామర్థ్యాలు, ప్రపంచ స్థాయి పోటీతత్వం-విలువ ఆధారిత వైద్య పర్యాటకం, డిజిటల్ సాంకేతికతలు-కృత్రిమ మేధ ద్వారా చేపట్టే ఆవిష్కరణలు అనే నాలుగు ప్రధానాంశాలపై ఆధారపడిన వ్యూహాత్మక విశ్లేషణను ఈ అధ్యయనం అందిస్తుంది. ఇది విస్తృతమైన నాణ్యతా గుర్తింపు, డిజిటల్ ఆరోగ్య రికార్డులు, సిబ్బంది నైపుణ్యాలు, అంతర్జాతీయ సన్నద్ధత, నూతన సాంకేతిక పరిజ్ఞానాల బాధ్యతాయుతమైన వినియోగానికి ఉన్న ఆవశ్యకతను ఇది తెలియజేస్తుంది.

ఆయుష్ కేవలం ఆరోగ్య సేవలు, ఆరోగ్య, సంరక్షణ వ్యవస్థగానే కాకుండా ఉపాధి కల్పన, ఔత్సాహిక పారిశ్రామిక, సేవా ఆధారిత ఆర్థిక వృద్ధిలో భాగస్వామిగా ఎదుగుతోందని ఈ అధ్యయన ఫలితాలు స్పష్టం చేశాయి. సంప్రదాయ, అనుబంధ వైద్య రంగంలో ప్రపంచ దేశాలతో భారత్ సంబంధాలు బలోపేతం కావడంలో కూడా విస్తరిస్తున్న ఆయుష్ పాత్రను ఇవి పునరుద్ఘాటించాయి.

విస్తరిస్తున్న ఆయుష్ సేవల వ్యవస్థపై సాక్ష్యం ఆధారిత మదింపును ఆర్ఐఎస్ అధ్య యనం అందిస్తుంది. భవిష్యత్తులో భారతదేశ వైద్యం, ఆరోగ్యం, ఆర్థికాభివృద్ధి ప్రాధాన్యాలకు ఈ రంగం అందించే తోడ్పాటును మరింత బలోపేతం చేసేందుకు గల అవకాశాలను కూడా ఇది గుర్తించింది.




Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.